ఈనాడు
అమరావతి
గుంటూరు
మంగళవారం అక్టోబరు 8, 2024





జన చండిక.. జయ చంద్రిక..

- మహాచండీ దర్శనం.. భక్తజన పావనం
- ఐదు రోజుల్లో 3.60 లక్షల మంది రాక
- రేపు దుర్గమ్మను దర్శించుకోనున్న ముఖ్యమంత్రి



ఈనాడు, డిజిటల్ - అమరావతి, న్యూస్‌టుడే - ఇంద్రకీలాద్రి, భవానీపురం, కృష్ణలంక, చిట్టినగర్: ఇంద్రకీలాద్రిపై దసరా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదో రోజు సోమవారం శ్రీమహాచండీదేవి రూపంలో దుర్గమ్మ దర్శనమిచ్చింది. తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 11 వరకూ 80 వేల మందికి పైగా భక్తులు మహాచండీదేవిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోజంతా సాఫీగా దర్శనాలు సాగిపోయాయి. ఐదు రోజుల ఉత్సవాల్లో మొత్తం 3.60 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఐదు రోజుల్లో ఆలయానికి ప్రసాదాలు, టిక్కెట్లు, కేశఖండన, ప్రత్యేక పూజలు, చీరల వేలం సహా అన్నింటిపైనా కలిపి రూ.2.50 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. ఐదు రోజుల వేడుకల్లో కనుల పండువగా నగరోత్సవం జరిగింది. పెద్దఎత్తున భక్తులు నగరోత్సవాన్ని తిలకించేందుకు వస్తున్నారు. దుర్గాఘాట్‌లో ప్రతిరోజు నదీ హారతి కొనసాగుతోంది. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు నిత్యం తరలివచ్చి నదీ హారతిని వీక్షిస్తున్నారు.


హారతులందుకుంటున్న భక్తులు


కమనీయం.. నగరోత్సవం



కొండపై క్యూలైన్లలో భక్తుల రద్దీ


కడియం నర్సరీ రైతు ఆధ్వర్యంలో ఉచిత వనప్రసాద పంపిణీ


మంగళ వాయిద్యకారుల సంకీర్తనాలాపన

అటువైపే చూడలేదు.. గ్రీజైనా పూయలేదు


కిందకి దిగని లాకు


ప్రకాశం బ్యారేజీ నుంచి లీకై వాగులోకి వెళ్తున్న నీరు

ఉండవల్లి కరకట్ట మొదట్లో కొండవీటివాగు ఎత్తిపోతల పథకం పక్కనున్న లాకులు పనిచేయడంలేదు. వైకాపా ప్రభుత్వం 5 ఏళ్లలో లాకులకు గ్రీజు పూయడం, మరమ్మతులు చేయకపోవడంతో తుప్పు పట్టిపోయాయి. లాకు గేట్లు సరిగా మూసుకోకపోవడంతో ప్రకాశం బ్యారేజీలోని నీరంతా వచ్చి గుంటూరు ఛానల్, ఎత్తిపోతల పథకం మోటార్లవద్దకు చేరుతోంది. అమరావతి రాజధానిలోని పాలవాగు, కొండవీటివాగు నుంచి వచ్చే నీరంతా ఎత్తిపోతల పథకం వద్దకు వస్తుంది. పెద్ద వరదలు, పులిచింతల, మునేరు వాగు వరద నీరు ఒక్కసారిగా వచ్చినపుడు లాకులు లేకపోవడం వల్ల ప్రకాశం బ్యారేజీ నుంచి నీరంతా గుంటూరు ఛానల్లోకి చేరుతోంది. సెప్టెంబరులో వచ్చిన వరదల్లో మంతెన సత్యనారాయణ ఆశ్రమం వద్దనున్న లాకులు కూడా పనిచేయకపోవడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేశారు. కొండవీటివాగు లాకులు కూడా బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు. **-ఈనాడు, అమరావతి**

రవాణా శాఖ ఆన్‌లైన్ సేవలు మరింత చేరువ

డీటీసీగా బాధ్యతలు స్వీకరించిన సీతారామిరెడ్డి



పట్టాభిపురం, న్యూస్‌టుడే: రవాణా శాఖలో ప్రభుత్వం చేపడుతున్న ఆన్‌లైన్ సేవల్ని ప్రజలకు మరింత చేరువ చేస్తామని గుంటూరు రవాణా శాఖ ఉప కమిషనర్ కె.సీతారామిరెడ్డి స్పష్టం చేశారు. డీటీసీగా ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీటీసీగా విధులు నిర్వర్తించిన షేక్ కరీం ఏలూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ కమిషనరేట్‌లో డీటీసీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీతారామిరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈయన 1994లో ఎంవీఐగా రవాణా శాఖలో చేరారు. బాపట్ల, చీరాల, కావలి, నెల్లూరులో ఎంవీఐగా పని చేశారు. నెల్లూరులో ఎంవీఐగా విధులు నిర్వర్తించే సమయంలో ఆర్టీఓగా పదోన్నతి లభించింది. తిరుపతి, విజయవాడల్లో ఆర్టీఓగా సేవలందించారు. 2019లో డీటీసీగా పదోన్నతి లభించింది. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ రవాణా శాఖ వాహన్, సారథి ద్వారా అందిస్తున్న ఆన్‌లైన్ సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తామన్నారు. దళారుల ప్రమేయాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాల నివారణకు, రహదారి భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఓవర్‌లోడింగ్, అధిక వేగం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌ఛార్జి ఆర్టీఓ గోపాల్, పలువురు ఎంవీఐలు.. సీతారామిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మకు దూరమై.. అంతలోనే చేరువై..

గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో పసికందు అపహరణ | గంటల వ్యవధిలో పట్టివేత


తల్లి నసీమా చెంతకు చేరిన శిశువు

గుంటూరు వైద్యం, నెహ్రూనగర్, న్యూస్‌టుడే : గుంటూరు సర్వజనాసుపత్రి (జీజీహెచ్)లో సోమవారం పసికందు అపహరణకు గురికావడం కలకలం రేపింది. పోలీసులు గంటల వ్యవధిలో కేసును ఛేదించి అపహరించిన ముఠాను అరెస్టు చేయడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం... గుంటూరు శివారు గోరంట్లకు చెందిన షేక్ నసీమా ఆదివారం రాత్రి జీజీహెచ్ కాన్పుల వార్డులో చేరారు. అర్ధరాత్రి తరువాత మగబిడ్డకు జన్మనిచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఓ మహిళ బాలింతలా కాన్పుల వార్డులోకి వచ్చింది. నసీమా వద్దకు వెళ్లి తనకు కొద్ది రోజుల కిందట బిడ్డపుట్టి చనిపోయినట్లు చెప్పి ఏడ్చింది. 'నీ బిడ్డ బాగున్నాడు' పక్కనే ఉన్న తన భర్తకు చూపించి వస్తానంటూ నసీమా వద్ద ఉన్న పసికందును తీసుకొని వెళ్లింది. శస్త్రచికిత్స చేసిన మత్తులో ఉన్న నసీమా సరేనని ఊరుకుంది. అర్ధ గంట దాటినా తన బిడ్డను తీసుకురాకపోవడంతో నసీమా పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే కొత్తపేట సీఐ వీరయ్య కేసు నమోదు చేసి ఎస్పీ సతీష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. జీజీహెచ్‌కు చేరుకొని సూపరింటెండెంట్‌తో కిరణ్ కుమార్‌తో కలిసి నిఘా నేత్రాలు పరిశీలించారు. అనుమానిత మహిళను గుర్తించారు.


వివరాలు తెలుపుతున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తదితరులు

ఆటోలో వచ్చి..

ఎస్పీ ఆదేశాలతో తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఎస్బీ డీఎస్పీ సీతారామయ్య, కొత్తపేట సీఐ వీరయ్య తదితరులు బృందాలుగా ఏర్పడి నిందితురాలి కోసం గాలించారు. ఆ మహిళ పాటు మరో ముగ్గురు జీజీహెచ్ నుంచి ఆటోలో పసికందును తీసుకెళ్తున్నట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు. నగరంలోని నిఘానేత్రాలను పరిశీలిస్తూ ఎస్పీ కార్యాలయం నుంచి సాంకేతిక పరిజ్ఞానంతో మరికొంత సమాచారం సేకరించారు. నిందితులు పల్నాడు జిల్లాకు వెళ్లినట్లు తేలడంతో కొత్తపేట సీఐ వీరయ్య తమ బృందాలతో అక్కడికి చేరుకున్నారు. నిందితులు అచ్చంపేట మండలం కోనూరులో ఉన్నట్లు సాయంత్రం 6 గంటలకు గుర్తించారు.

ముగ్గురు నిందితుల అరెస్టు

బోరుగడ్డ శిరీష పసికందును అపహరించి తీసుకువెళ్లినట్లు తేలింది. కోనూరులో బోరుగడ్డ శిరీషతోపాటు ఆమె భర్త ప్రేమ్‌కుమార్, చింతపల్లి మంగమ్మ (శిరీష తల్లి)ను అరెస్టు చేసి గుంటూరు తీసుకువచ్చామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. పసికందును జీజీహెచ్‌లో ఉన్న తల్లి నసీమా చెంతకు చేర్చారు. బిడ్డను చూసిన తల్లి ఆనందం వ్యక్తం చేసింది. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ... ఆటోలో నలుగురు వచ్చి బాబును అపహరించినట్లు గుర్తించామని, ఇప్పటికి ముగ్గురిని అరెస్టు చేశామని మరో వ్యక్తికోసం గాలిస్తున్నామన్నారు. శిరీష మాత్రం తాను జీజీహెచ్‌లో బాబుకు జన్మనిచ్చానని, ఆ పసికందునే తీసుకువెళ్లానని చెబుతున్నారని, అది వాస్తవమా కదా అనేది దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు.

★ జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ... గత నెల 20న బిరుదుగడ్డ శిరీష, పిడుగురాళ్ల అని ప్రభుత్వాసుపత్రికి వచ్చినట్టు తమ రికార్డుల్లో ఉన్నదన్నారు. ఆమె తన బిడ్డకు గుండెజబ్బు ఉందని 24న ఆసుపత్రిలో చేరగా... 25న ఆ బిడ్డ చనిపోవడంతో ఆసుపత్రి నుంచి వెళ్లిపోయారని చెప్పారు. కేసు విచారణ తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెప్పారు.


ఆర్ఎఫ్ఐడీ సిబ్బంది నిర్లక్ష్యం

ఆసుపత్రిలో తల్లీ బిడ్డల సంరక్షణకు రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్(ఆర్ఎఫ్ఐడీ) ట్యాగ్‌లను వేసి పూర్తి రక్షణ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బిడ్డ జన్మించగానే తల్లీ బిడ్డకు ట్యాగ్‌లు వేస్తారు. బిడ్డను బయటకు తీసుకెళ్తే వెంటనే శబ్దం వస్తుంది. ఆ బిడ్డ తెల్లవారుజామున పుట్టినప్పటికీ మధ్యాహ్నం వరకు ట్యాగ్ వేయకపోవడం గమనార్హం. దీనివల్లే బిడ్డను అపహరించడం చాలా తేలికైంది. దీనిపై సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గతంలోనూ ఆర్ఎఫ్ఐడీ కాంట్రాక్టరును హెచ్చరించినప్పటికీ ఫలితం కనిపించలేదన్నారు. ఈ రోజు ఘటనకు సంబంధించి గుత్తేదారుకు తాఖీదు ఇచ్చామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు.

కొంతే సరఫరా.. కొండెక్కిన ధర

పట్టాభిపురం, న్యూస్‌టుడే

టమాటాల ధర దారెత్తిస్తుంది. దొండకాయలు అదే దారి పట్టాయి. వంగ, దోసకాయల ధరలు మోస్తరుగా పెరిగాయి. గత నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, ముంచెత్తిన వరదలతో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. డిమాండ్ సరిపడా సరకు రాకపోవడంతో వీటి ధరలు పెరుగుతున్నాయి. స్థానికంగా పంట చేతికి అంది వచ్చే సమయంలో వరదల కారణంగా దెబ్బతిన్నాయి. ఫలితంగా కూరగాయల తోటలను కాపాడుకోవడం రైతులకు కష్టతరమైంది.



మదనపల్లి నుంచి సరకు రావాల్సిందే



టమాటాల ధర గతంతో పోలిస్తే రెట్టింపు కంటే దాటేసింది. టమాట స్థానికంగా లభ్యం కాకపోవడంతో ధర అంతకంతకూ పెరుగుతోంది. ఇంతకుముందు నారాకోడూరు, వేజండ్ల, సుద్దపల్లి తదితర ప్రాంతాల్లో రైతులు టమాటాలు పండించేవారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల నుంచి సరిపడా సరకు రావడంలేదు. మదనపల్లి నుంచి టమాటాలు వస్తున్నాయి. రైతుబజార్లలో కేజీ టమాటాల ధర గత నెలలో రూ.30 ఉండగా, ప్రస్తుతం రూ.66 వరకు చేరుకుంది. కృష్ణనగర్ రైతుబజార్‌కు గతంలో 25 క్వింటాళ్ల వరకు టమాటాలు వచ్చేవి. ప్రస్తుతం 12 క్వింటాళ్లు కంటే రావడం లేదని రైతులు చెబుతున్నారు.

పూత, పిందె రాలిపోవడంతో..

దొండకాయల ధరలు కూడా బాగా పెరిగాయి. వీటి ధర రూ.29 నుంచి రూ.49కు పెరిగింది. వర్షాలకు పూత, పిందె రాలిపోవడంతో ఆశించినంత మేరకు సరకు రావడం లేదు. ఎకరాకు 10 టిక్కీలు రావాల్సిన దిగుబడి 2 టిక్కీలు మాత్రమే వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. రైతుబజార్‌కు గతంలో ఎనిమిది క్వింటాళ్లు వచ్చే దొండకాయలు ప్రస్తుతం సగానికి సగం పడిపోయింది. నాలుగు క్వింటాళ్ల కంటే సరకు రావడం లేదు. తెనాలి, వేమూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల నుంచి నారాకోడూరు, పెద వడ్లపూడి, గొడవర్రు తదితర ప్రాంతాల నుంచి దొండకాయలు వస్తుంటాయి. ఈ ప్రాంతాల్లో పంట లేకపోవడంతో ఆశించిన స్థాయిలో సరకు రావడం లేదు.

☛ వంకాయల ధర గతంలో రూ.19 ఉండగా ప్రస్తుతం రూ.27కు చేరుకుంది. పొత్తూరు, అంగలకుదురు, దుగ్గిరాల, జంపని, బాపట్ల, కంతంరాజు కొండూరు తదితర ప్రాంతాల్లో రైతులు వంకాయలు పండిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల నుంచి అవసరానికి సరిపడా సరకు రావడం లేదు.

☛ బెండ, క్యారెట్ ధరలు గతం కంటే కొంత మేరకు తగ్గాయి. బీన్స్, క్యాప్సికమ్ ధరలు అర్ధ సెంచరీ దాటేశాయి. అవసరానికి సరిపడా క్యాప్సికం, బీన్స్ రైతుబజార్‌కు రావడం లేదు. బీన్స్ ధర రూ.94 ఉండగా, క్యాప్సికం ధర రూ.64 వరకు ఉంది.

బెండ	39	25
బీర	54	44
క్యాబేజి	26	23
క్యారెట్	56	42
బంగాళదుంప	40	38


యూకే వీసాల పేరుతో భారీ మోసం

- గుంటూరులో ఓ కన్సల్టెన్సీ కంపెనీ నిర్వాకం
- నిర్వాహకుల ఆగడాలకు వైకాపా నాయకుల అండ!

ఈనాడు-అమరావతి

యూకే వీసాలు ఇప్పిస్తామని నిరుద్యోగ యువతను రూ.కోట్లలో ముంచేసింది గుంటూరుకు చెందిన ఓ కన్సల్టెన్సీ కంపెనీ. మోసం విలువ రూ.10 కోట్లకుపైనే ఉంటుందని అంచనా. వృద్ధులకు సేవ చేయాలనుకునే వారికి పలు దేశాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, అందుకు అవసరమైన వీసా, ఉద్యోగాలిప్పిస్తామని నమ్మబలికి భారీగా డబ్బులు వసూలు చేసింది. తీరా వారిచ్చిన వీసాలు, ఉద్యోగ నియామక లేఖలు నకిలీవని తేలడంతో చివరకు ఎంబసీ అధికారులు సుమారు పది మంది యువకులపై 10 ఏళ్ల పాటు వీసా తీసుకోకుండా నిషేధం విధించింది. ఇందులో గుంటూరుకు చెందిన ఇద్దరు యువకులు ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మోసపోయిన వారు వందల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం.

☛ గతేడాది డిసెంబరులో గుంటూరు అశోక్‌నగర్ కేంద్రంగా ఏర్పాటైన కన్సల్టెన్సీ కంపెనీ ఇచ్చిన వీసాలు, జాబ్ ఆఫర్ లెటర్లు చెల్లవని తెలుసుకుని ఈ ఏడాది జులై నుంచి గుంటూరులోని నగరంపాలెం, నల్లపాడు, పట్టాభిపురం స్టేషన్ పరిధిలో కొందరు యువకులు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసులు నమోదు చేసి మిన్నకుండిపోయారు. సమాధానం చెప్పకుండా కన్సల్టెన్సీ నిర్వాహకులు మొహం చాటేశాడు. ప్రశ్నించేందుకు కొందరు యువకులు గుంటూరులోని ఓ నిర్వాహకుడి ఇంటికి వెళ్లారు. తనను బెదిరించి కొట్టడానికి వచ్చారని, ఇంట్లో వారిపై దౌర్జన్యం చేశారని వారిపై నల్లపాడు పోలీసులకు అతను రివర్స్ ఫిర్యాదు చేయడం గమనార్హం.



ఆధారాలు చూపినా కేసు లేదు

కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులను ఆధారాలతో సహా పోలీసులకు ఫిర్యాదు అందజేసినా నిర్వాహకులపై కేసు పెట్టలేదు. సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించి పంపించేశారు. వారి మోసం వల్ల నాకు వీసా రాకుండా పదేళ్ల నిషేధం విధించారు. కన్సల్టెన్సీ నిర్వాహకులు, భాగస్వాములకు వైకాపా నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఆ పార్టీ నిర్వహించే సమావేశాలు, ర్యాలీలకు ఈ కన్సల్టెన్సీ నిర్వాహకులే డీజేలు ఏర్పాటు చేయడం, యువతను తరలించడం వంటివి చేశారు. ఆ నేతల ముసుగులో వారు మోసాలకు పాల్పడ్డారు.
- అప్పిరెడ్డి అనిల్‌రెడ్డి, గుంటూరు

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు

వీసాకు రూ.12 లక్షలు ఖర్చవుతుందని నిర్వాహకుడు లక్ష్మీశెట్టి జయరాం ఒప్పందం కుదుర్చుకున్నాం. చెక్కు రూపేణా రూ.4.50 లక్షలు, ఆన్‌లైన్‌లో మరో రూ.2 లక్షలు చెల్లించా. నిర్దేశిత మొత్తంలో సగం చెల్లించాక సీఓఎస్ వస్తుందని, అది రాగానే మిగిలిన మొత్తం చెల్లించాలని చెప్పారు. తీరా సీఓఎస్ పట్టుకుని హైదరాబాద్‌లోని వీసా కార్యాలయానికి వెళ్తే నకిలీదని తేలింది. దానిపై ప్రశ్నించి డబ్బులు వెనక్కు ఇవ్వాలని కోరితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. ఈ మోసంపై నగరంపాలెం స్టేషన్‌లో ఫిర్యాదు చేశా. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు. **- శరత్, ఏటీ అగ్రహారం, గుంటూరు**

మద్యం దుకాణాలకు పోటాపోటీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరు జోన్ పరిధిలోని మద్యం దుకాణాలకు సోమవారం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ఆదివారం వరకు జోన్ పరిధిలోని గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 256 మద్యం దుకాణాలకు 618 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. సోమవారం ఒక్కరోజు గుంటూరు జిల్లాలో 800, పల్నాడు జిల్లాలో 220 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం మంచిరోజు కావడంతో వ్యాపారులు ఒక్కసారిగా తరలిరావడంతో ఎక్సైజ్ పోలీసుస్టేషన్లు కిక్కిరిసిపోయాయి. సోమవారం సాయంత్రానికి గుంటూరు జిల్లాలో 127 దుకాణాలకు మొత్తం 1200, పల్నాడు జిల్లాలోని 129 దుకాణాలకు గాను 644 దరఖాస్తులురాగా మూడు దుకాణాలకు ఒక్కటి నమోదు కాలేదు. ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌ల్లో సిబ్బంది సోమవారం రాత్రి వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జోన్ డీసీ శ్రీనివాసులు, ఏసీ రవికుమార్‌రెడ్డి, ఈఎస్ అరుణకుమారి పర్యవేక్షించారు.

రాయితీపై టమాటా

పట్టాభిపురం(గుంటూరు), న్యూస్‌టుడే: మార్కెట్‌లో టమాటాల ధర మోత మోగుతున్న నేపథ్యంలో రాయితీపై రైతుబజార్లలో కిలో టమాటా రూ.50 వంతున విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఏడీఎం రాజబాబు తెలిపారు. జిల్లాలోని అన్ని రైతుబజార్లలో డ్వాక్రా సంఘాల ద్వారా టమాటాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ధరలు దిగివచ్చే వరకు రూ.50కే టమాటాల విక్రయాలు కొనసాగిస్తామని తెలిపారు. మదనపల్లె నుంచి దిగుమతి చేసుకోవడంతో పాటు హోల్‌సేల్ ట్రేడర్ల నుంచి రూ.60 వంతున ప్రభుత్వం కొనుగోలు చేసి వినియోగదారులకు రూ.50కు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అందరి ఆమోదంతో నూతన కౌలు చట్టం

అభిప్రాయాలు తెలిపిన రైతులు, సంఘాల నాయకులు ✤ ప్రాంతీయ సదస్సులో మంత్రి అచ్చెన్నాయుడు



సమావేశంలో పాల్గొన్న రైతులు, కౌలుదారులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కౌలు రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా అందరి ఆమోదంతో నూతన కౌలు చట్టాన్ని రూపొందిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. నూతన కౌలు చట్టం రూపకల్పనపై తొలి ప్రాంతీయ సదస్సు సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో జరిగింది. సమావేశానికి వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షత వహించారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత చట్టాలకు భిన్నంగా కొత్త చట్టాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. అందులో భాగంగానే భూ యజమానులను, కౌలురైతులు, రైతు సంఘాలందరితోనూ సమావేశమై అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్ మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ఏపీలోనే కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారన్నారు. వారికి రుణాలు మంజూరు చేసేలా ప్రస్తుత చట్టంలో మార్పులు చేస్తామన్నారు. సాగు చేసిన పంటపై కౌలు రైతుకు హక్కు ఉంటుందే గాని భూమిపై ఉండదన్నారు. తద్వారా భూమి యజమానులకు ఇబ్బంది ఉండదన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన రుణ అర్హత కార్డులు చూసుకోవడానికే పనికొచ్చేవని, అలా కాకుండా ఆ కార్డు ద్వారా రుణాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ నూతన చట్టంలో జిల్లా స్థాయి అధికారిని అప్పిలేట్ అధికారిగా నియమిస్తే బాగుంటుందన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియను వ్యవసాయ శాఖకు కేటాయించడం వల్ల ఇబ్బందులు న్యాయన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ క్రిస్టినా, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ప్రసంగించారు.

✤ ప్రాంతీయ సదస్సులో భాగంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల నుంచి వచ్చిన రైతు సంఘాలు, రైతులు, కౌలు రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. రైతు సంఘాల నాయకులు హరిబాబు, వి.కృష్ణయ్య, ప్రభాకర్ రెడ్డి, సుభాని, కల్లి రంగారెడ్డి, రైతులు బి.శ్రీనివాసులు, శ్రీకాంత్, దినేష్, గురవయ్య, వేణుగోపాల్, రమణయాదవ్, కొండయ్యలు వారి అభిప్రాయాలు తెలిపారు.

సీట్ల కేటాయింపుపై కసరత్తు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తయి పక్షం రోజులవుతున్నా జిల్లా పరిషత్తు కార్యాలయంలో బదిలీపై వచ్చిన ఉద్యోగులకు సీట్లు కేటాయించడంపై కసరత్తు పూర్తి కాలేదు. జడ్పీలో పని చేస్తున్న మొత్తం 50 మంది పరిపాలన అధికారుల్లో మూడింట రెండొంతుల మందిని మినహాయించి మిగిలినవారిని బదిలీ చేశారు. వారి స్థానాల్లో బదిలీపై వచ్చిన ఏవోలు విధుల్లో చేరిపోయారు. వీరితో పాటు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. వీరందరికి విభాగాలను కేటాయించి ఆఫీస్ ఆర్డర్ ఇస్తే ఆయా సీట్ల బాధ్యతలను నిర్వహిస్తారు. పరిపాలన అధికారులను ఏయే విభాగాల్లో నియమించాలనే దానిపైనే కసరత్తు చేస్తున్నారు. జిల్లాపరిషత్తు పాలకవర్గంతో చర్చించిన తర్వాత సీఈవో జ్యోతిబసు ఓడీ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే పక్షం రోజులవుతున్నా సీట్లను కేటాయించకపోవడంతో సీఈవో సూచన మేరకు సిబ్బంది ఆయా పనులు చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఉద్యోగులకు సీట్లు కేటాయించనున్నట్లు సమాచారం.

బౌన్సర్ హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ భార్గవి, సీఐ శ్రీనివాసరావు, వెనుక నిందితుడు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలిలో ఇటీవల హత్యకు గురైన బౌన్సర్ పి.కోటేశ్వరరావు (36) కేసులో నిందితుడు షేక్ ఆదాము షఫీను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ బి.జనార్దనరావు తెలిపారు. తెనాలి గ్రామీణ పోలీస్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటేశ్వరరావు, షఫీ ఇరువురు చాలా కాలంగా స్నేహితులు. గతంలో కోటేశ్వరరావు వద్ద షఫీ రూ.10 వేలు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించలేదు. దీనితో కోటేశ్వరరావు తరుచూ అర్ధరాత్రి సమయాల్లో షఫీకి ఫోన్ చేసి నువ్వు అప్పు తీర్చలేకపోతే నీ భార్యను పంపు అంటూ అసభ్యకరంగా మాట్లాడేవాడు. పదేపదే ఇదే కొనసాగుతుండటంతో కోటేశ్వరరావుపై కక్ష పెంచుకున్న షఫీ ఈ నెల 1న మద్యం తాగుదాం రమ్మని పిలిచి బుర్రిపాలెం రోడ్డులోని ఖాళీ స్థలంలో మద్యం తాగిన తర్వాత తాను వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా అతనిపై దాడి చేయటంతో రక్తగాయాలతో అతను ఘటనా స్థలిలోనే ప్రాణాలు విడిచాడు. వివరించారు. ఈ నెల 2వ తేది ఉదయం ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేసి యావత్తు అంశాలను తెలుసుకుని షఫీని అరెస్ట్ చేశారు. సమావేశంలో శిక్షణ డీఎస్పీ ఎన్.భార్గవి, సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్సై ప్రతాప్, కానిస్టేబుళ్లు బాలాజీ, వి.రవి, డి.రవి పాల్గొన్నారు.

వేగంగా సమస్యల పరిష్కారమే లక్ష్యం

✤ రెవెన్యూ, మున్సిపల్, పోలీసు విభాగాల అర్జీలే అధికం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, సబ్ కలెక్టర్ సంజనా సింహ, అధికారులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, జిల్లా కేంద్రం వరకు రాకుండా అందుబాటులో ఉండేందుకు లక్ష్యంగా నియోజకవర్గాల్లో 'ప్రజా సమస్యల-పరిష్కార వేదిక' కార్యక్రమం చేపట్టినట్లు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి వారు అర్జీలు స్వీకరించారు. అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని, నివేదికలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. మొత్తం 80 అర్జీలు వచ్చాయి. వాటిల్లో 70 శాతం మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ విభాగాలకు చెందినవి ఉన్నాయని, కాల పరిమితిలో లోబడి సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీల స్వీకరణ, తర్వాత దశలను నిరంతరం సమీక్షించడానికి 8 మందితో ప్రత్యేక ఆడిటింగ్ బృందాన్ని ఏర్పాటు చేశామని, వారు అర్జీదారులతోనూ మాట్లాడుతూ ఉంటారన్నారు.

ఇసుకపై అపోహలు వద్దు: ఇసుకపై రకరకాల ఊహాగానాలు చెలరేగుతున్నాయని, వరదల వల్ల కొంత మేర ఇబ్బందులు ఏర్పడ్డాయి తప్ప ఇతరత్రా సమస్యలు ఏమీ లేవని జిల్లా కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వం ఇసుకను పూర్తి ఉచితంగా అందిస్తుందని, తవ్వకాలు, రవాణా ఛార్జీలు, జీఎస్టీ వంటి కొన్ని మాత్రమే వసూలు జరుగుతుందన్నారు. జిల్లాలో మరో నాలుగు కొత్త ఇసుక రీచ్‌లను కూడా గుర్తించామని, ఆయా చోట్ల యంత్రాలతో కాకుండా మ్యాన్యువల్‌గా ఇసుక తోడాల్సి ఉంటుందని, ఈ మేరకు టెండర్లు పిలవనున్నామన్నారు. ఇసుక సమస్యలు, అక్రమాలపై ప్రజలు ఫిర్యాదులు చేయటానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామని, ఫోన్ నంబరు 0863-2234201కు ప్రజలు సమాచారం ఇవ్వవచ్చని వివరించారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ వేసి ఐఆర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న జోసఫ్ సుధీర్‌బాబు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి సారించి పీఆర్‌సీ వేసి వెంటనే మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని ఏపీఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం కంకరగుంట ఎస్టీయూ భవన్‌లో సంఘం జిల్లా ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. జోసఫ్‌సుధీర్‌బాబు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల భవితవ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న జీవోనెం.117ను అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు పట్టించుకోక పోవడం ఏంటని ఎద్దేవాచేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దార్ల పెదబాబు, డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ పాత పీఆర్‌సీ గడువు దాటి సంవత్సరం గడిచిందన్నారు. పీఆర్‌సీ కమిటి వేసి అప్పటి వరకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఏవీ.ప్రసాద్‌బాబు, రాష్ట్ర కౌన్సిలర్ జోసెఫ్, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొన్నారు.. డబ్బులివ్వడం లేదు..

✤ రెండ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని మంత్రి హామీ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరానికి చెందిన నేరెళ్ల హరిప్రసాద్ పత్తిని కొనుగోలు చేసి.. డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన బాధితులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు విన్నవించారు. గుంటూరు కలెక్టరేట్‌కు సోమవారం వచ్చిన మంత్రి అచ్చెన్నాయుడిని బాధితులు కలిశారు. డబ్బులు ఇప్పించాలని సీఎం చంద్రబాబును కలిసి విన్నవించామని ఆయన సూచనతో స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కనీసం పది నిమిషాలు కూడా ఉంచకుండా ఓ కార్పొరేటర్ అతడిని తీసుకెళ్లిపోయాడన్నారు. రూ.1.90 కోట్లు చెల్లించాల్సి ఉందని, తమకు పత్తి అమ్మిన వారంతా వచ్చి డబ్బులు అడుగుతున్నారని ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని, ఆ డబ్బులు రాకుంటే తామంతా ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఉందంటూ ఓ బాధితురాలు వాపోయారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి సమస్య పరిష్కరించాలని సూచించారు. రెండు రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపుతామని ఆమెకు మంత్రి హామీ ఇచ్చారు. సదరు బాధితులతో కలెక్టర్ మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి తాము చర్యలు తీసుకుంటామని భయపడొద్దని వారికి ధైర్యం చెప్పారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఈ నెల 8 నుంచి నాలుగు రోజులు రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ నిర్వహిస్తామని రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఎం.డానియేల్ ప్రదీప్ తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన పురుషుల జట్లు పాల్గొంటాయన్నారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభగల క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో సంతోష్ ట్రోఫీ కోసం జరిగే జాతీయ సీనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర


ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

సీఎం సహాయ నిధికి రూ.4 లక్షలు అందజేత

దుగ్గిరాల, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సహాయ నిధికి దుగ్గిరాల మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్ రూ.4 లక్షలు అందించారు. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి సంబంధిత చెక్కు అందజేసినట్లు వెనిగళ్ల తెలిపారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అలుపెరగని కృషి చేస్తున్నారన్నారు.


మంత్రి లోకేశ్‌కు చెక్కు అందిస్తున్న మాజీ ఎంపీపీ వెనిగళ్ల కుటుంబ సభ్యులు

మంగళగిరిలో తెదేపా శ్రేణుల ప్రదర్శన

మంగళగిరి, న్యూస్‌టుడే : మంగళగిరిలో తెదేపా శ్రేణులు సోమవారం ఉదయం భారీ ర్యాలీ నిర్వహించారు. పద్మశాలీయ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నందం అబద్దయ్య, డైరెక్టర్లుగా కందుల నాగార్జున(తెదేపా), పర్వతం మధుసూదన్‌రావు(జనసేన)లు నియమితులు కావడంతో వారి ప్రమాణ స్వీకారోత్సవం గొల్లపూడిలో జగిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు వాహనాలపై పాత మంగళగిరి సీతారామ కోవెల వద్ద నుంచి ప్రదర్శనగా తరలివెళ్లారు. ఇందులో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్తున్న నందం అబద్దయ్య తదితరులు

రుణాల వసూలు నూరు శాతం చేయాలి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : బ్యాంకు లింకేజీ, ఉన్నతి, స్త్రీ నిధి రుణాల వసూలు నూరు శాతం చేయాలని డీఆర్‌డీఏ- వెలుగు ప్రాంతీయ సమన్వయకర్త రాంబాబు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఏపీఎం వి.లాజర్ అధ్యక్షతన యానిమేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆర్థిక ప్రగతిపై ఆయన సమీక్షించారు. సామాజిక పెట్టుబడి నిధి రికవరీ 20 శాతం మాత్రమే ఉందని, నూరు శాతం పెంచాలన్నారు. 1246 గ్రూపులకు 174 గ్రూపులు ఎన్‌పీఏ కావడం, యానిమేటరు సభ్యురాలిగా ఉన్న గ్రూపు కూడా ఎన్‌పీఏ కావడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. యానిమేటర్లు క్రమశిక్షణతో సభ్యులకు సేవలు అందించాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని ఏపీఎం వి.లాజర్ చెప్పారు.


యానిమేటర్లతో మాట్లాడుతున్న ప్రాంతీయ సమన్వయకర్త రాంబాబు, ఏపీఎం లాజర్

అభివృద్ధి పనుల పరిశీలన

దుగ్గిరాల, న్యూస్‌టుడే : కంఠంరాజుకొండూరు మహంకాళి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిర్మాణాల్ని రెండు నెలల్లో పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ఉప కమిషనర్ కె.బి.శ్రీనివాస్ చెప్పారు. సోమవారం ఆయన ఆలయానికి వచ్చి రూ.కోట్లతో జరుగుతున్న అభివృద్ధిని పరిశీలించారు. ఈవో సునీల్, గుత్తేదారుతో మాట్లాడారు. వంశ పారంపర్య ధర్మకర్త దేవభక్తుని రంగప్రసాద్, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.


నిర్మాణాల్ని పరిశీలిస్తున్న ఉప కమిషనర్ తదితరులు

పొంచి ఉన్న ప్రమాదం

పెదనందిపాడు, న్యూస్‌టుడే

మండలంలోని వరగాని బస్టాండ్ కూడలి వద్ద దేవాదాయ శాఖకు చెందిన ఏలూరి లక్ష్మి నరసింహం ట్రస్టు సత్రం భవనంపై చెట్లు మొలిచి గోడలు బీటలు వారాయి. దీంతో ఆ భవనం ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అందులో పాములు కూడా తిరుగుతున్నాయని వాపోతున్నారు. దీన్ని తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


సత్రంపై మొలిచిన మొక్కలు

భవనాన్ని తొలగిస్తాం

శిథిల భవనాన్ని తొలగించేందుకు చర్యలు చేపడతాం. అయితే ట్రస్టు సభ్యులు అంగీకార పత్రం ఇవ్వాల్సి ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

- అశోక్ కుమార్, ఈవో, దేవాదాయ శాఖ (వరగాని గ్రూప్)

అందిన పరిహారం.. పొంగిన ఆనందం

తుళ్లూరు, మేడికొండూరు, న్యూస్‌టుడే

నగదు జమ కావడంపై రైతుల హర్షాతిరేకాలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తోంది. తాడికొండ నియోజకవర్గంలోని మేడికొండూరు, తాడికొండ, తుళ్లూరు మండలాల్లో ఎన్ని ఎకరాల్లో నష్టం జరిగింది? తదితర వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి అందించింది. ఆ వివరాలను మదింపు చేసిన ప్రభుత్వం రైతుల ఖాతాలకు నగదు జమ చేసింది.


పెదపరిమిలో వరద నీటిలో మునిగిన పత్తిని చూపుతున్న రైతు(పాత చిత్రం)

అధికంగా దెబ్బతిన్నాయి..

తుళ్లూరు మండలంలో ఎనిమిది గ్రామాల్లో 487 మంది రైతులకు చెందిన సుమారు 787 ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నాయని అధికారులు వివరాలు ప్రభుత్వానికి పంపారు. ప్రధానంగా పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాల్లో వరదల కారణంగా పంటలు అధికంగా దెబ్బ తిన్నాయి. మేడికొండూరు మండలంలో 355 మంది రైతులకు చెందిన 220 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు అధికారులు నమోదు చేశారు. ఏదైనా కారణాలతో నష్ట పరిహారం అందని వారు ఉంటే రైతు సేవా కేంద్రాలకు వచ్చి వివరాలు అందించాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.

మండలం	బాధిత రైతులు	దెబ్బతింది (హెక్టార్లలో..)
మేడికొండూరు	355	220
తుళ్లూరు	487	787

సొమ్ము నేరుగా ఖాతాలో పడింది



మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాం. ఇటీవల కురిసిన వర్షాలకు వరద పోటెత్తి పంట దెబ్బతింది. వ్యవసాయ అధికారులు పొలాన్ని పరిశీలించారు. ఒక్క ఎకరంలో పంట దెబ్బతిందని వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వారం రోజుల కిందట నష్ట పరిహారం కింద రూ.10వేలు జమ చేసింది. సొమ్ము నేరుగా బ్యాంకు ఖాతాలో పడింది. **- కాటి శ్రీనివాసరావు, కౌలు రైతు, యలవర్తిపాడు**

ప్రభుత్వం మాట నిలబెట్టుకుంది



ఎకరాలో పత్తి వేశాను. వర్షం, వరద ప్రభావానికి పొలంలో నీరు చేరి పంట దెబ్బతింది. అధికారులు వచ్చి పంట పరిశీలించారు. 75 సెంట్లు పాడైపోయిందని తేల్చారు. ప్రభుత్వం వారం రోజుల కిందట పరిహారం సొమ్ము రూ.4 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేసింది. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది.

- యర్నాడి వెంకట నర్సయ్య, యలవర్తిపాడు

తుళ్లూరు డీఎస్పీగా బాధ్యతల స్వీకరణ

తుళ్లూరు, న్యూస్‌టుడే : తుళ్లూరు డీఎస్పీగా టి.మురళీకృష్ణ సోమవారం మందడంలోని ఎస్‌డీపీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన బాపట్ల జిల్లా రేపల్లె డీఎస్పీగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. నిత్యం ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగించే రాజధానిలో శాంతి భద్రతల సమస్యలు ఏర్పడకుండా చట్టపరంగా తగు చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.


మురళీకృష్ణ

ఫిరంగిపురంలో 'ప్రజా దర్బార్' నేడు

ఫిరంగిపురం గ్రామీణం, మేడికొండూరు, న్యూస్‌టుడే : ఫిరంగిపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం, మేడికొండూరు వేణుగోపాల స్వామి కల్యాణ మండపంలో బుధవారం 'ప్రజా దర్బార్' కార్యక్రమం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొంటారు. స్థానిక సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరిస్తారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి.

ఈవోపీఆర్డీగా వరూధుని

పెదనందిపాడు, న్యూస్‌టుడే : మండల ఈవోపీఆర్డీగా బృందానం వరూధుని సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన సాయిలీల తాడికొండకు బదిలీపై వెళ్లారు. వీఆర్వోలుగా సాంబయ్య (రావిపాడు), కోటేశ్వరరావు(కొప్పర్రు), సునీల్(గోగులమూడి) కూడా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దార్ శంకరబాబు తెలిపారు.

అసత్య ప్రచారాలు చేస్తే ఫిర్యాదు చేస్తాం

తుళ్లూరు, న్యూస్‌టుడే : రాజధాని రైతులను తప్పుదోవ పట్టించేలా కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా చేసే ప్రచారాలను నమ్మవద్దని సీఆర్డీఏ అధికారులు తెలిపారు. సోమవారం ఈ విధమైన సంక్షిప్త సందేశాలను ఒక వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడాన్ని సీఆర్డీఏ అధికారులు గుర్తించారు. అవి రాజధాని రైతుల మధ్య భావోద్వేగాలు రెచ్చగొట్టేలా సందేశాలు ఉన్నాయన్నారు. అమరావతి అభివృద్ధికి సహకరించాలే గాని అసత్య ప్రచారం చేయడం దారుణమన్నారు. ఈ విషయాన్ని సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ దృష్టికి తీసుకెళ్లి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరుతామని సీఆర్డీఏ అధికారులు తెలిపారు.

రెవెన్యూ అధికారుల బదిలీ

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే : మండలంలో రెవెన్యూ శాఖలో పని చేస్తున్న పలువురు అధికారులు బదిలీ అయ్యారు. డిప్యూటీ తహసీల్దారు వెంకటరావు పొన్నూరుకు, ఆర్ఐ శివబాలకృష్ణ తాడికొండకు, సీనియర్ అసిస్టెంట్ ముప్పాళ్ల సుబ్బారావు పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు, కుర్నూతల వీఆర్వో శ్రీనివాసరావు చేబ్రోలుకు వెళ్లనున్నారు.

9, 10 తేదీల్లో గరికపాటి ప్రవచనాలు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే : మండలంలోని వింజనంపాడు కోదండ రామస్వామి దేవాలయంలో ఈ నెల 9, 10 తేదీల్లో దసరా నవరాత్రులపై పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావు ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

మాజీ సర్పంచి మృతికి నివాళి

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే : మండలంలోని అనంతవరప్పాడు మాజీ సర్పంచి కోయ సాంబయ్య(98) వృద్ధాప్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా గ్రామంలో సోమవారం జరిగిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్, వైద్యులు గడ్డం వేణుగోపాల్, బండారు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

మంగళగిరి, న్యూస్‌టుడే : స్థానిక మల్లేశ్వర స్వామి ఆలయంలో శ్రీకాశి అన్నపూర్ణేశ్వరి సేవాట్రస్ట్ ఆధ్వర్యాన సోమవారం పలువురు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ట్రస్ట్ ఛైర్మన్ పందేటి సాంబశివరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

మేడికొండూరు, న్యూస్‌టుడే : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. దీన్ని ఎంపీపీ స్వప్న, ఎంపీడీవో చందన ప్రారంభించారు. తాగు నీటి సౌకర్యాలు, వీధి దీపాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ పూర్ణ శంకరావు శిక్షకులుగా వ్యవహరించారు. ముందుగా మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.


బాపూజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంపీడీవో చందన, ఎంపీపీ స్వప్న

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీల అభివృద్ధిలో వార్డు సభ్యులు, ఉప సర్పంచులు భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రెండ్రోజుల పాటు జరగాల్సిన శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఎంపీడీవో జ్యోతి వెలిగించి ఆరంభించారు. ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ షేక్.ఖాజా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


అద్దె భవనాన్ని ప్రారంభిస్తున్న ఛైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి, శాఖ మేనేజరు కృష్ణమోహన్


270 శాఖలతో రూ.24 వేల కోట్ల వ్యాపారం

దుగ్గిరాల, న్యూస్‌టుడే : చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఎనిమిది జిల్లాల్లో 270 శాఖల ద్వారా రూ.24 వేల కోట్ల వ్యాపారం చేస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ కె.ప్రమోద్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం దుగ్గిరాల శాఖ కొత్తగా నిర్మించిన అద్దె భవనంలోకి మారుతున్న దృష్ట్యా ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. బ్యాంకు ప్రాంతీయ మేనేజరు శ్రీనివాస్, పీఅండ్‌డీ విభాగం హెచ్‌వోడీ ఆంజనేయులు, స్థానిక బ్రాంచి మేనేజరు హెచ్.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.


దుగ్గిరాల: ఈమనిలో..



తాడేపల్లి : శివాలయంలో..


మంగళగిరిలో..


తుళ్లూరు : అనంతవరంలో..

దుర్గమ్మా.. చల్లగ చూడమ్మా

మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో దసరా ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాల్లో అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. సోమవారం విశేష అలంకారం చేసి పూజలు చేశారు. - న్యూస్‌టుడే, బృందం


ప్రత్తిపాడులో..


బోయపాలెంలో


పెదనందిపాడులో..


పాలపర్రు సూర్యేశ్వర స్వామి దేవాలయంలో..


కొండపాటూరులో..

మద్యం మత్తులో గడ్డిమందు తాగి ఆత్మహత్య

క్రైమ్ కార్నర్

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : మద్యం మత్తులో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ప్రత్తిపాడుకు చెందిన తన్నీరు శ్రీనివాసరావు(33) మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగేందుకు నగదు ఇవ్వకపోతే చనిపోతానని ఇంట్లో వారిని బెదిరిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం తాగిన మైకంలో శ్రీనివాసరావు ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి వాంతులు చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగేంద్ర తెలిపారు.

వెలగపూడిలో..

తుళ్లూరు, న్యూస్‌టుడే : వెలగపూడికి చెందిన మండవ వెంకట రామయ్య(75) గత కొంతకాలంగా నరాలకు కణుతులు రావడంతో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయమై తుళ్లూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ప్రత్తిపాడు మండలం యనమదలకు చెందిన నుదురుపాటి సింగయ్య(46) కూలీ పని చేస్తుంటారు. ఈ నెల 4న ఫిరంగిపురం వచ్చి తమ బంధువు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా.. వేములూరిపాడు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. అతడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మెకానిక్ మృతదేహం లభ్యం

దుగ్గిరాల, న్యూస్‌టుడే : స్నేహితులతో కలిసి మండలంలోని రేవేంద్రపాడు వద్ద రేపల్లె కాల్వలోకి ఈతకు దిగిన పెదవడ్లపూడికి చెందిన కారు మెకానిక్ షేక్ ఖాజా(28) మృతదేహం సోమవారం పెదపాలెం వద్ద లభ్యమైంది. ఆదివారం మధ్యాహ్నం తన నలుగురు స్నేహితులతో కలిసి కాల్వ వద్దకు వచ్చిన ఖాజా, మరో యువకుడు ఈతకు దిగడం, నీటి ప్రవాహానికి గల్లంతైన విషయం తెలిసిందే. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అత్తింటి వారు కొట్టారని ఫిర్యాదు

తుళ్లూరు, న్యూస్‌టుడే : ఉద్దండరాయునిపాలేనికి చెందిన పులి మత్తయ్యకు అదే గ్రామానికి చెందిన నందినితో సుమారు పదేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు. ఒక కుమార్తె అనారోగ్య కారణాలతో మృతి చెందింది. కొద్దిరోజుల నుంచి భార్యాభర్తల మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 5న కుటుంబ సభ్యుల మధ్య జరిగిన గొడవలో భర్త మత్తయ్య, అత్త, ఆడబిడ్డలు కలిసి నందినిని కొట్టి గాయపరచడంతో ఆమె గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొంది సోమవారం తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

మాజీ సైనికుడిపై దాడి.. కేసు నమోదు

తాడికొండ, న్యూస్‌టుడే : మాజీ సైనికుడిపై నలుగురు వ్యక్తులు దాడి చేసి గాయపర్చిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. లాం గ్రామానికి మాజీ సైనికుడు రాయపూడి కృపాచారికి సర్వే నం: 300లో పూర్వికుల నుంచి సంక్రమించిన భూమి ఉంది. ఆ స్థలం కోర్టు వివాదంలో ఉండటంతో ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుని దాని చుట్టూ ప్రహరీ నిర్మించింది. భూమి వాడుకలో లేకపోవడంతో చెట్లు దట్టంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానికులైన కాళ్ల లోకేష్, కొరగంటి విజయ్ అందులో చెట్లను నరికి మొద్దులను టన్నుల లెక్కన అక్రమంగా అమ్ముకుంటున్నారు. దీన్ని గమనించిన కృపాచారి వారిని అడ్డుకున్నారు. దీంతో లోకేష్, విజయ్‌లతో పాటు జితేంద్ర, కాళ్ల రాజారావు అనే వ్యక్తులు వచ్చి కృపాచారిని అడ్డుకుని మారణాయుధాలతో దాడి చేశారు. ఈ ఘటనలో తలకు గాయలైన బాధితుడికి గుంటూరు ప్రభుత్వాసుత్రిలో చేర్పించి చికిత్స అందించారు. సోమవారం గ్రామానికి చేరుకున్న అతడు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసు తెలిపారు. కాగా లోకేష్, విజయ్ విలేకరుల మంటూ బెదిరించి దాడులు, అక్రమాలకు పాల్పడుతున్నారని గుంటూరు కలెక్టర్‌లో, తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో కొన్నాళ్ల కిందట పలువురు ఫిర్యాదు చేశారు.

ఇసుక అక్రమ రవాణాపై..

తుళ్లూరు, న్యూస్‌టుడే : ఉద్దండరాయునిపాలెం సమీపంలో అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీని తుళ్లూరు పోలీసులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆటో బోల్తా: ఇద్దరికి తీవ్రగాయాలు

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రమాదవశాత్తు ఆటో బోల్తా కొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. గుంటూరు నుంచి ఓ ఆటో పల్నాడు జిల్లా నకరికల్లు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో మండలంలోని రేపూడి శివారుకు వచ్చేసరికి తేలికపాటి వర్షం పడుతోంది. ఈ క్రమంలో ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న లంకలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. చోదకుడు బుడే, మరో వ్యక్తి అందులో ఇరుక్కుపోయారు. స్థానికులు వచ్చి వారికి బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో గుంటూరు సర్వజనాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మిగిలిన వివరాలు తెలియాల్సి ఉంది.

సమస్యల వలయంలో రైతు సేవా కేంద్రాలు..!

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, తాడికొండ, న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించింది. రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని గొప్పలు చెప్పింది. అప్పట్లో గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున అరకొర వసతులతో రైతు సేవా కేంద్రాలను నిర్మించింది. కొన్ని గ్రామాల్లో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోవడంతో భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.


మేడికొండూరు : పాలడుగులో అసంపూర్తిగా ఇలా..

అద్దె చెల్లింపుల్లో జాప్యం

వైకాపా అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే) వ్యవస్థ తీసుకొచ్చింది. అందులో ప్రత్యేక సిబ్బందిని నియమించి రూ.లక్షలు ఖర్చు చేసి పరికరాలు అందుబాటులో ఉంచారు. తొలుత సొంత భవనాలు లేకపోవడంతో అద్దె గదులను తీసుకుని ఒక్కో దానికి సుమారు రూ.3 వేలు దాకా అద్దె చెల్లించారు. ఈ క్రమంలో గత ప్రభుత్వం కాలక్రమేణ అద్దె బకాయిలు చెల్లించడంలో జాప్యం చేసింది. దీంతో కొన్ని చోట్ల కేంద్రాలను ఖాళీ చేయించారు. తర్వాత కొన్నాళ్లకు గ్రామాల్లో జనాభా ఆధారంగా చేసుకుని ఈ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు గాను ఒక్కో దానికి రూ.21.80లక్షలు దాకా కేటాయించింది. ఆయా నిర్మాణ పనులను గుత్తేదారు సంస్థలకు అప్పగించారు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ పనులు జరిగాయి. వాటిల్లో మరుగుదొడ్డి, నీటి వసతి కల్పించేందుకు నిధులు మంజూరు చేయక పోవడంతో అవి ఏర్పాటు కాలేదు. దీంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

కొరవడిన మౌలిక వసతులు

ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

నిరుపయోగంగా మారాయి..

మరో పక్క సకాలంలో బిల్లులు రాకపోవడంతో మిగిలిన పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రాలేదు. దీంతో పలుచోట్ల భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయి నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల పేరు తొలగించి రైతు సేవా కేంద్రాలుగా నామకరణం చేసింది. తక్షణమే కూటమి ప్రభుత్వం కలగజేసుకుని ఈ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, అసంపూర్తిగా మిగిలిన వాటిని పూర్తి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మండలం	మంజూరైనవి	పూర్తైనవి	అసంపూర్తిగా మిగిలినవి
మేడికొండూరు	07	06	01
ఫిరంగిపురం	10	08	02
తాడికొండ	06	04	02
తుళ్లూరు	03	–	–

పనులు ప్రారంభించలేదు

అమరావతి రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండలంలో పెద్దపరిమి, హరిశ్చంద్రాపురం, వడ్డమాను మినహా మిగిలిన గ్రామాలు సీఆర్డీఏ పరిధిలోకి వెళ్లాయి. ఆ మూడు గ్రామాల్లో ఆర్బీకేలు కట్టేందుకు నిధులు కేటాయించారు. పలు కారణాలతో ఒక్కచోట కూడా భవన నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో అక్కడ వ్యవసాయ అధికారులు, సిబ్బంది అద్దె భవనాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నారు.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

ప్రాంగణ ఎంపికలో 15 మందికి ఉద్యోగాలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం క్యూ స్పైడర్స్, బెంగళూరు కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 15 మంది తుది ఏడాది బీటెక్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు అందాయి. కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపల్ అజయ్, కంపెనీ ప్రతినిధులు స్వాతి, శ్రీలేఖ పర్యవేక్షించారు.

9, 10 తేదీల్లో గరికపాటి ప్రవచనాలు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని విజనంపాడు కోదండ రామస్వామి దేవాలయంలో ఈ నెల 9, 10 తేదీల్లో దసరా నవరాత్రులపై పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావు ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

ఏఎన్‌యూలో వన్యప్రాణి వారోత్సవాలు

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. బోర్డు సంచాలకులు బీవీఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న వాతావరణ కాలుష్యానికి అడ్డుకట్ట వేసి వన్యప్రాణులను రక్షించాలని పిలుపునిచ్చారు. వాతావరణ మార్పుల వల్ల జీవవైవిధ్యం దెబ్బతింటోందని చెప్పారు. విద్యార్థులు జీవవైవిధ్యంపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. జీవవైవిధ్యం-వన్యప్రాణులు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో విజయం సాధించిన వారికి కృష్ణమూర్తి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫరీదా, షేక్ గాలిబ్, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణంలోని సాంబశివనగర్‌లో కచ్చా రహదారితో రాకపోకలు నిర్వహించాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంది. సిమెంటు రహదారి నిర్మించాలి. -పల్లా రాంబాబు, సాంబశివనగర్

✔ నిధులు మంజూరు కాగానే సిమెంటు రహదారి నిర్మిస్తాం. **- అపర్ణ, సహాయ ఇంజినీర్**

? పట్టణంలోని క్యాబిన్‌పేటలో రెండు రోజులు నుంచి చెత్తను తొలగించలేదు. చెత్త రహదారి పైకి రావడంతో దుర్గంధం వస్తోంది -పి.శ్యామల, క్యాబిన్‌పేట

✔ చెత్తను తొలగించేలా తగు చర్యలు తీసుకుంటా. **- శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి**

-న్యూస్‌టుడే, పొన్నూరు

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. షరాఫ్‌బజార్‌లోని మురుగు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. **-న్యూస్‌టుడే, పొన్నూరు**

ఇళ్ల లబ్ధిదారులకు అండగా ఉంటాం

పొన్నూరు, న్యూస్‌టుడే: జగనన్న కాలనీలోని లబ్ధిదారులకు అండగా ఉంటానని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు పేర్కొన్నారు. మండలంలోని ఆరెమండలో సోమవారం జగనన్న లబ్ధిదారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీ 10 మంది లబ్ధిదారులు నుంచి గుత్తేదారుడు రూ.35 వేలు వసూలు చేశారని, కాని గృహ నిర్మాణ పనులు చేపట్టలేదని తెలిపారు. గృహ నిర్మాణ పనులు చేపట్టకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా వేదికలో సమస్యలు బోలెడు..

పరిష్కారాలపై ఆశాభావం



కలెక్టర్, ఎస్పీలకు సమస్యలను వివరిస్తున్న నాయకులు, ప్రజలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం వేదికగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సబ్ కలెక్టర్ సంజనా సింహ పర్యవేక్షణలో సోమవారం నిర్వహించిన సమస్యలు, పరిష్కారాల వేదికకు ప్రజలు, నాయకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అధికారులు సమస్యలు పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. మొత్తం 80 అర్జీల్లో సింహ భాగం మున్సిపల్, రెవెన్యూ నుంచే ఉన్నాయి. రోడ్లపై గుంతలు, రక్షిత మంచి నీటి పైపు లైన్ లీకేజీ గురించి సీపీఎం నాయకులు బాబూప్రసాద్, వరద నష్టం నమోదు, కౌలు రైతు సమస్యలను శివసాంబిరెడ్డి ఇతర నాయకులు అధికారులకు తెలిపారు. తెనాలి మండలం సంగంజాగర్లమూడిలో తమ సొంత భూములను దేవాలయ భూములుగానున్నారని రైతులు అర్జీ ఇవ్వగా, అదే గ్రామం నుంచి ఆలయ భూములు ఆక్రమించుకున్నారని కాపాడాలని అర్జీ వచ్చింది. బంధువుకు అప్పుగా నగదు ఇస్తే తిరిగి చెల్లించకుండా అడిగినందుకు ఎదురు కేసులు పెట్టారని, మధ్యవర్తులు సైతం మాట మారుస్తున్నారని, బాధితులమైన తామే పోలీసుస్టేషన్ చుట్టూ తిరుగుతున్నామని పట్టణానికి చెందిన తల్లీకుమార్తె తమ ఆవేదన వినిపించారు. ఉద్యోగం ఇప్పిస్తానని నగదు తీసుకుని మోసం చేశారని పట్టణ వాసి ఎస్పీకి తెలియచేయగా, వైకాపా నాయకుడు డాక్టర్ రియాజ్‌ఖాన్ తాను వార్డు కార్యాలయం కోసం అద్దెకు తీసుకున్న ఇంటి యజమాని తమకు తెలియకుండా తాళాలు పగులగొట్టి అందులోని విలువైన వస్తువులు తన ఆధీనంలో ఉంచుకున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు, వ్యక్తిగత వివాదాలపై పలు అర్జీలు వచ్చాయి.



అర్జీలను ఆన్‌లైన్ విధానంలో నమోదు చేస్తున్న సిబ్బంది

దివ్యాంగ పింఛను రాలేదు



ఎముకల సమస్యలతో గత పది సంవత్సరాలుగా వీల్‌ఛైర్‌లోనే ఉన్నా. వృద్ధాప్య పింఛను వస్తుంది కాని దివ్యాంగ పింఛను మంజూరు కాలేదు. కుటుంబ సభ్యులు కూడా దుర్భాషలాడుతున్నారు. ఈ అంశాలపై అర్జీ ఇచ్చా.**- పార్వతి, ఐతానగర్**

ఆస్తి ఆక్రమించుకున్నారు



సొంత ఆస్తి మా బంధువులే రాకుండా చేసి ఆక్రమించుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. ఎలాంటి ఫలితం లేదు. కలెక్టర్ పరిష్కరిస్తారని అర్జీ ఇచ్చా.**- సామ్రాజ్యం, కొలకలూరు**

ఉడా కాలనీలో తాగునీటి ఇబ్బందులు



ప్రభుత్వ లే అవుట్ ఉడా కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా పార్కులకు కేటాయించిన స్థలాలను ఇతర అవసరాలకు వాడుతున్నారు. రోడ్లు, కాలువలు, తాగునీటి సమస్యలు పరిష్కారం కావటం లేదు. మా సమస్యలు తీర్చాలని అధికారులను కోరాం. **- నారాయణరావు, జయపాల్, మౌలానాముస్కిన్, ఉడా కాలనీ సంఘ ప్రతినిధులు**

అంగన్‌వాడీల సమస్యలపై వినతి

పొన్నూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ పొన్నూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.వీ.సుకన్య పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ప్రాజెక్టు అధికారిణి వెంకటరమణకు వినతి పత్రం అందచేశారు. ఈ నెల 15న గుంటూరు పీడీ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో పాల్గొన్నారని పిలుపునిచ్చారు.

నటుడు మిథున్ చక్రవర్తి ఎంపికపై హర్షం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రముఖ నటుడు మిథున్ చక్రవర్తిని దాదాసాహెబ్ పాల్కే పురస్కారానికి ఎంపిక చేయడం పట్ల మా ఏపీ వ్యవస్థాక అధ్యక్షుడు దిలీప్‌రాజా ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

అసత్య ప్రచారాలు చేస్తే ఫిర్యాదు చేస్తాం

తుళ్లూరు, న్యూస్‌టుడే : రాజధాని రైతులను తప్పుదోవ పట్టించేలా కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా చేసే ప్రచారాలను నమ్మవద్దని సీఆర్డీఏ అధికారులు తెలిపారు. సోమవారం ఈ విధమైన సంక్షిప్త సందేశాలను ఒక వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడాన్ని సీఆర్డీఏ అధికారులు గుర్తించారు. అవి రాజధాని రైతుల మధ్య భావోద్వేగాలు రెచ్చగొట్టేలా సందేశాలు ఉన్నాయన్నారు. అమరావతి అభివృద్ధికి సహకరించాలే గాని అసత్య ప్రచారం చేయడం దారుణమన్నారు. ఈ విషయాన్ని సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ దృష్టికి తీసుకెళ్లి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరుతామని సీఆర్డీఏ అధికారులు తెలిపారు.

270 శాఖలతో రూ.24 వేల కోట్ల వ్యాపారం

దుగ్గిరాల, న్యూస్‌టుడే : చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఎనిమిది జిల్లాల్లో 270 శాఖల ద్వారా రూ.24 వేల కోట్ల వ్యాపారం చేస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ కె.ప్రమోద్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం దుగ్గిరాల శాఖ కొత్తగా నిర్మించిన అద్దె భవనంలోకి మారుతున్న దృష్ట్యా ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. బ్యాంకు ప్రాంతీయ మేనేజరు శ్రీనివాస్, పీఅండ్‌డీ విభాగం హెచ్‌వోడీ ఆంజనేయులు, స్థానిక బ్రాంచి మేనేజరు హెచ్.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

నిరుపయోగంగా బహుళ ప్రయోజన గోదాం

పెదకాకాని, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో కమీషన్ల కోసం ఇష్టానుసారం వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భవనాలు నిర్మించారు. రైతులు తమ పంటలు దాచుకునేందుకు స్థానిక కోమటి కుంట చెరువు భూమిలో పెదకాకాని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సుమారు రూ.42 లక్షలు వ్యయం చేసి బహుళ ప్రయోజన గోదాం నిర్మించింది. రెండేళ్ల కిందట కేంద్ర బృందం ఈ గోదాం పరిశీలించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 21వ తేదీన నాటి ప్రభుత్వ ప్రతినిధులు ప్రారంభించారు. అప్పటి నుంచి గోదాంకి వేసిన తాళాలు తెరచుకోలేదు. ఎరువులు, పంటలను రైతులు నిల్వ చేసుకునేందుకు సహకార పరపతి సంఘం దీన్ని నిర్మించింది. అధికారులు దీనిపై రైతులకు అవగాహన కల్పించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నిరుపయోగంగా ఉందని విమర్శలున్నాయి. వ్యవసాయ సంబంధిత పంటలు నిల్వ చేసినందుకు తక్కువ అద్దె చెల్లించేలా నిబంధనలున్నాయి. ➠ ఈ గోదాం పక్కన రెండు ఆర్బీకేల భవనాల పునాదుల వరకు నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం ఈ నిర్మాణాల్లో వాడిన ఇనుప రాడ్డులు తుప్పుపట్టి పోతున్నాయి. ఇప్పటికే ఆర్బీకేకి సంబంధించి గుత్తేదారు రూ.లక్షల్లో బిల్లులు చేసుకొని తీసుకున్నట్లు సమాచారం.




పెదకాకాని కోమటికుంట చెరువు స్థలంలో నిరుపయోగంగా గోదాం



అసంపూర్తిగా ఆర్బీకే భవన నిర్మాణం

పొలాలకు అందుబాటులోలేని ప్రదేశం



ఏదైనా భవనం నిర్మించాలంటే పొలాలు ఉన్న చోట లేక రైతులకు అందుబాటులో నిర్మించాలి. గత పాలకులు కమీషన్ల కోసం కక్కుర్తి పడి రూ.లక్షల్లో ప్రభుత్వ సొమ్మును వృథా చేశారు. ఊరి చివర డంపింగ్ యార్డు (వాసన వచ్చే ప్రదేశం)లో బహుళ ప్రయోజన గోదాం నిర్మించడంతో నిరుపయోగంగా మారింది. వ్యవసాయ రంగానికి సంబంధించి ఈ గోదాం వాడుకోలేం. లబ్ధి చేకూరే విధంగా ఉంటే రైతులు సద్వినియోగం చేసుకుంటారు. **-పెండ్యాల శ్రీకాంత్, పెదకాకాని రైతు**

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు

కొల్లిపర, న్యూస్‌టుడే: ముందస్తు ప్రణాళికతో పంచాయతీలను అభివృద్ధిలో నడిపించటంలో స్థానిక నేతల పాత్రకీలకమని ఎంపీపీ భీమవరపు పద్మావతీ అన్నారు. పంచాయతీ ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు, కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు జరగాలని కోరారు. ఈవోపీఆర్డీ భార్గవ మాట్లాడారు.

నిత్యావసరాల ధరలు అదుపు చేయాలి

చేబ్రోలు, న్యూస్‌టుడే: రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో సోమవారం మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరద బాధిత రైతులకు పరిహారం అందించడంలో రాజకీయ జోక్యం సరికాదని పేర్కొన్నారు. చేబ్రోలు మండలశాఖ కార్యదర్శిగా పల్లా ఆదిశేషును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సీతారా ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



అత్తోట: అమ్మ వారిని దర్శించుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్



గంగానమ్మపేట: సాదా లడ్డూలతో మంగళగౌరి అలంకారం



బోసురోడ్డు: అన్నపూర్ణదేవిగా వాసవీ మాత



రాజమాతంగి అలంకారంలో..



నంబూరు దశావతార ఆలయంలో ధైర్యలక్ష్మిగా



పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయంలో..

మహాలక్ష్మి.. మనసా స్మరామి



చేబ్రోలు: లలితాత్రిపుర సుందరీదేవి

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఐదు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లోని అమ్మ వారి ఆలయాలు సోమవారం భక్తులతో కళకళలాడాయి. మంగళగౌరి, అన్నపూర్ణదేవి, రాజమాతంగి, గ్రాయత్రీదేవి, లలితాదేవి తదితర అలంకారాల్లో శక్తి ప్రదాయని దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. **-న్యూస్‌టుడే, బృందం**



పొన్నూరు వాసవీ ఆలయంలో..



కొల్లిపర: ముక్తేశ్వరస్వామి ఆలయంలో చండీదేవి



నిడుబ్రోలు శివాలయంలో..



పొన్నూరు: గాయత్రీదేవిగా

గొయ్యి.. ఆదమరిస్తే అంతే!



పొన్నూరు మండలం చింతలపూడి నుంచి నిడుబ్రోలు మార్గంలో రహదారి మధ్య పెద్ద గొయ్యి ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో గొయ్యి కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగక ముందే అధికారులు మేల్కొని మరమ్మతులు నిర్వహించేలా తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**



ఏసీఈ యోబు మృతికి సంతాపం

ఎ.ఎన్.యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అదనపు పరీక్షల నియంత్రణ(ఏసీఈ) అధికారి నంబూరు యోబు సోమవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ఏఎన్‌యూ ప్రధాన ద్వారం వద్ద యోబు పార్థివదేహానికి ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం నివాళులర్పించారు. యోబు గత నెల ఏసీఈగా పదోన్నతి పొందారు. అంతలోనే ప్రాణాలు కోల్పోవడంతో విశ్వవిద్యాలయంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. యోబుకు భార్య ఉన్నారు.

నిడుబ్రోలు రహదారి పనులకు శ్రీకారం



ఈనాడు కథనానికి స్పందన

పొన్నూరు: నిడుబ్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి రైల్వే వంతెన వరకు రహదారి గోతులమయంగా మారింది. రహదారి మరమ్మతులకు గత ప్రభుత్వం రూ. 25 లక్షలు నిధులు మంజూరు చేసింది. పనులు నిర్వహించడానికి గుత్తేదారుడు ముందుకు రాలేదు. గత నెల 18వ తేదీన 'ఆ దారంటే హడలే' శీర్షికతో కథనం ప్రచురితమైంది. రోడ్డు భవనాల శాఖాధికారులు స్పందించారు. ఇటీవల నిడుబ్రోలులో రహదారి మరమ్మతుల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. త్వరలోనే రహదారి మరమ్మతులను పూర్తి చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామని రోడ్డు భవనాల శాఖ సహాయ ఇంజినీర్ గోగినేని శ్రీనివాసరావు వెల్లడించారు.

బంగారం వదిలి.. నగదు అపహరణ

కొల్లిపర, న్యూస్‌టుడే: కొల్లిపరకు చెందిన రైతు గుదిబండి రామిరెడ్డి పిల్లల వివాహం అనంతరం ఒంటరిగా ఉంటున్నారు. పసుపు పంట అమ్మగా వచ్చిన రూ.3.5 లక్షల నగదులో ఇంటి అవసరాలకు రూ.2.5 లక్షలు ఖర్చుచేయగా.. మిగిలిన రూ.లక్షను బీరువాలో దాచారు. ఈనెల 5న హైదరాబాద్‌లో పిల్లల ఇంటికి వెళ్లి సోమవారం ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి తలుపు గడి, తాళం పగలకొట్టి ఉన్నాయి. బీరువాకు వేసిన తాళం వేసినట్టే ఉందని, బీరువాలోని సొమ్ము మాయమైంది. బంగారు నగలు అలానే ఉన్నాయి. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొల్లిపర ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపారు.

ఘర్షణపై ఫిర్యాదులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ చినరావూరులో ఆదివారం రాత్రి నిర్వహించిన సభా కార్యక్రమం వద్ద కొంత మంది ఘర్షణ పడి ఒకరిపై మరోకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు సోమవారం తెలిపారు.

భర్త వేధింపులపై..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: భర్త వేధిస్తున్నాడని పట్టణ ఐతానగర్‌కు చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు సోమవారం తెలిపారు.

బడి తోటలతో ఆరోగ్యం

చేబ్రోలు, న్యూస్‌టుడే

ప్రస్తుతం ఏ కూరగాయలు, ఆకుకూరలను ముట్టకున్నా మందులు, ఎరువుల ఆనవాళ్లే. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యార్థులకు చక్కని పోషకాహారం అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బడితోట పేరుతో కూరగాయలు పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది.

★ ఎదిగే పిల్లలకు చక్కని పోషక విలువలు కలిగిన ఆహారం అవసరం. బజారులో దొరికే కూరగాయల్లో రసాయనాలు ఎక్కువగా ఉండడంతో పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో నేరుగా విద్యార్థులే పంటలు పండిస్తే వారికి వ్యవసాయంపై ఆసక్తి, ఆరోగ్యం చక్కగా ఉంటుందని ప్రభుత్వం ఆలోచన చేసింది. గతంలో తెదేపా పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో కూరగాయలను పండించేవారు. వైకాపా పాలన రాగానే ఈ విధానాన్ని అటకెక్కించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బడి తోటలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

★ సొంతంగా కూరగాయలు, ఆకుకూరలు పండిస్తే రసాయనాల వినియోగం తగ్గుతుంది. పిల్లలకు ఆరోగ్యంతో పాటు పాఠశాల పరిసరాలు పచ్చదనంతో నిండుతాయి. మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు బయట కొనుగోలు చేసే పరిస్థితి తప్పుతుంది. ప్రస్తుతం ఏ రకం కూరగాయలు చూసిన కేజీ రూ.60 తక్కువ లేదు. స్వయంగా పండిస్తే చాలా వరకు నగదు మిగులుతుంది.



కూరగాయల మొక్కలు



వేజండ్ల ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాలలో ఆకు కూరలు సాగు

అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేయిస్తాం

మండలంలో 48 పాఠశాలల్లో 3,969 మంది విద్యార్థులు ఉన్నారు. మొదటి దశలో 23 పాఠశాలలు బడి తోట కార్యక్రమానికి ముందుకు వచ్చాయి. వాటిల్లో 15 పాఠశాలల్లో కూరగాయలు, అకుకూరలు పండిస్తున్నారు. రానున్న రోజుల్లో అన్ని పాఠశాలల్లో బడితోటలను పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

-సుబ్బారావు, అదనపు ఎంఈవో, చేబ్రోలు

నిర్లక్ష్యం అల్లుకుంది

పొన్నూరు మండలం ములుకుదురులోని జీబీసీ ప్రధాన రహదారిలో విద్యుత్తు స్తంభానికి పిచ్చి మొక్కలు దట్టంగా అలుకుపోయాయి. విద్యుత్తు శాఖాధికారులు ప్రతి రెండో శనివారం సరఫరా నిలిపి వేసి పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. జీబీసీ ప్రధాన రహదారిలో స్తంభానికి పిచ్చి మొక్కలు అలుకున్న వాటిని తొలగించమని అనేక సార్లు సిబ్బందికి ఫిర్యాదు చేసిన చర్యలు చేపట్టలేదని స్థానికులు వాపోతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**



ఇది అడవి కాదు.. లేఔట్

దర్పణం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన సిరిపురం లేఔట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయని స్థలాల్లో రెల్లి ఏపుగా పెరిగి అడవిని తలపిస్తోంది. రెల్లి పూలు గాలికి రహదారి వెంట వెళ్తున్న వారిపై పడుతున్నాయని వాహన చోదకులు, పాదచారులు పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)**



నిరుపయోగ భవంతులతో ఇబ్బందులు

పట్టణంలోని రామలింగేశ్వరపేటలోని టెలిఫోన్ సిబ్బంది క్వార్టర్లు నివాసాలకు పనికిరావని సంవత్సరాల కిందటే తేల్చేశారు. ఆ తర్వాత వాటి గురించి పట్టించుకోవటం మానేశారు. ఈ భవంతుల ఆవరణల్లో పిచ్చి చెట్లు విపరీతంగా పెరిగాయి. వాటిల్లో విషసర్పాలు చేరడంతో పరిసర నివాసితులకు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్తు స్తంభాలను సైతం అధిగమిస్తూ పిచ్చి చెట్లు పైపైకి చేరుతున్నాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, తెనాలి టౌన్**



గుంటూరు తూర్పు



ఎన్‌టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో రూ.ల్లో) టమాట 68, వంగ 34, బెండ 24, పచ్చిమిర్చి 24, కాకర 24, క్యారెట్ 43, క్యాలీఫ్లవర్ 38, క్యాబేజీ 24, బీర 24, దొండ 49, బంగాళదుంప 39, ఉల్లి పాయలు 38, గోరుచిక్కుళ్లు 32, దోస 31, పొట్ల 34, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 64, చామదుంప 38, మునగ రూ.8, గోంగూర 10, తోటకూర 15, కొత్తిమీర 25, బీట్‌రూట్ 28, కీర 34, క్యాప్సికం 65, అల్లం 65, ఫ్రెంచి బీన్స్ 94, సొర 16, అరటి 7. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

తెదేపాతోనే నగరాభివృద్ధి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: గుంటూరు నగరాభివృద్ధి తెదేపా హయంలోనే సాధ్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. 11వ డివిజన్‌లోని గొలుసు కొండలరావునగర్ ఒకటో లైనులో రూ.29.90 లక్షలతో నూతన మంచినీటి పైపులైను నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే రూ.5కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

హిందూ ఇంజినీరింగ్ విద్యార్థి ప్రతిభ


మునీర్‌ను అభినందిస్తున్న చెరువు రామకృష్ణమూర్తి, పక్కన నర్సిరెడ్డి, పీడీ రవి

నగరపాలక సంస్థ (గుంటూరు): హిందూ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ ద్వితీయ ఏడాది విద్యార్థి షేక్ మునీర్ రాష్ట్రస్థాయి డెకాథ్లాన్‌లో ప్రతిభ చూపారని కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. సోమవారం కళాశాల కార్యాలయంలో మునీర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణమూర్తి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఈనెల 4 నుంచి 6 వరకు జరిగిన 37వ ఏపీ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 20 సంవత్సరాల బాలుర విభాగం డెకాథ్లాన్ ఈవెంట్‌లో తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వజ్రాల నర్సిరెడ్డి, పీడీ క్రోసూరు రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల అవస్థలు


లిఫ్ట్ వద్ద నిలుచున్న ప్రయాణికులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ పని చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్‌కు నిత్యం 40వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు చేస్తుంటారు. ప్లాట్‌ఫాంలపై ఉన్న రైళ్లను చేరుకోడానికి ప్రయాణికులు లిఫ్ట్ ద్వారా కిందకు వెళ్లి సబ్‌వేలో నుంచి ప్లాట్‌ఫాంలకు వెళ్తుంటారు. ప్రస్తుతం పనిచేయని లిఫ్ట్ కారణంగా వృద్ధులు, చిన్నారులు మెట్ల మార్గం ద్వారా సబ్‌వేలో నుంచి రాకపోకలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కనీసం పట్టించుకోవడంలేదు. దీంతో కొందరు ప్రయాణికులు లిఫ్ట్ వద్ద పడిగాపులు కాస్తున్నారు. అధికారులు ఇప్పటికైన స్పందించి లిఫ్ట్‌కు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మా వెతలు తీర్చరూ!

ఫిర్యాదుదారులతో కిక్కిరిసిన పోలీసు కార్యాలయం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో బాధితులు తరలి వచ్చారు. డీఎస్పీలు రమేష్, సుబ్బారావు, శివాజీరాజు ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి ఆదేశించారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న డీఎస్పీలు రమేష్, సుబ్బారావు, శివాజీరాజు


అర్జీలు నమోదు కేంద్రంలో భారీసంఖ్యలో ఫిర్యాదుదారులు

ఇంటిపైకి వచ్చి బెదిరిస్తున్నారు



నేను కాటన్ జిన్నింగ్ మిల్లు నిర్వహిస్తున్నాను. ఎవరైనా పత్తి తీసుకువస్తే జిన్నింగ్ చేసి ఆ పనికి డబ్బులు తీసుకుంటాను. ఈక్రమంలో పిరంగిపురానికి చెందిన ఓ వ్యాపారి పలువురు రైతుల వద్ద పత్తికొనుగోలు చేసి మా వద్ద జిన్నింగ్ చేయించుకొని తీసుకెళ్లి అమ్ముకున్నాడు. అతను రైతులకు డబ్బులు చెల్లించకుండా నాపై రైతులతో తప్పుడు కేసులు పెట్టించాడు. కొద్దిరోజుల కిందట మా ఇంటిపైకి రైతుల ముసుగులో రౌడీలను పంపించి గొడవ చేయించాడు. నాకు రైతులకు ఎటువంటి లావాదేవీలులేవు. నన్ను బెదిరిస్తున్నవారిపై చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలి.
- హరిప్రసాదరావు, చంద్రమౌళినగర్

అన్యాయంగా ఇంటిని తీసుకున్నారు



కూలిపనులు చేసుకుంటూ చల్లావారిపాలెంలో 81 గజాల స్థలం కొనుగోలు చేశాం. అందులో ఇల్లుకట్టుకోడానికి ఓ కానిస్టేబులు వద్ద అప్పుగా డబ్బులు తీసుకొని చెల్లిస్తున్నాం. అలా రూ. 6 లక్షల అప్పుకు వడ్డీతో కలిపి రూ.14లక్షలు బాకీ కట్టాలన్నాడు. నేను బ్యాంక్‌లో రూ.9 లక్షలు రుణం తెచ్చుకొని కట్టుకుంటున్నాను. బాకీ మొత్తం కట్టాలని లేకపోతే కేసుపెడతానని బెదిరించి ఆ ఇంటిని తన విక్రయ అగ్రిమెంట్‌పై బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇటీవల బ్యాంకులో రుణం రూ.9 లక్షలు తాను కడతానంటూ మొత్తం రూ.24 లక్షలు మేము తీసుకున్నట్లు బెదిరించి రూ.80 లక్షలు చేసే మా ఇంటిని దౌర్జన్యంగా తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు.
- జానకిరాములు, ధనలక్ష్మి, చల్లావారిపాలెం

32 రోజులు చావుతో పోరాడాను

ఓ షాపులో గుమస్తాగా పనిచేస్తూ జీవిస్తున్నాను. మా బంధువులు తమ స్థలాన్ని ఇస్తామంటూ రూ. లక్ష తీసుకున్నారు. సంవత్సరాలు గడచినా ఇవ్వలేదని అడిగితే అందరి ముందు కొట్టి అవమానించారు. మనస్తాపంతో యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేశా. 32 రోజులు ప్రభుత్వాసుపత్రితో చావుతో పోరాడి బయటపడ్డాను. నా జీవితాన్ని నాశనం చేసినవారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరాను.
- రామకృష్ణ, రామనామక్షేత్రం

పాలస్తీనాకు సంఘీభావం



ప్రదర్శనలో సీపీఎం, సీపీఐ నాయకులు

నెహ్రూనగర్: పాలస్తీనాకు సంఘీభావం తెలుపుదాం.. ఇజ్రాయిల్, అమెరికా యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిద్దాం అంటూ వామపక్షపార్టీల నాయకులు సోమవారం గుంటూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్, నాయకులు నళినీకాంత్, నరసింహారావు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, చిష్టి, నేతాజీ, అప్పారావు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, ఖాసిం, సలీం, కార్తీక్, నికల్సన్, మాల్యాద్రి, హనుమంతురావు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పొరుగు రాష్ట్రాల్లో అధ్యయనానికి కమిషనర్

నగరపాలకసంస్థ(గుంటూరు): ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో పురపాలక శాఖలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలు పరిశీలించేందుకు కమిషనర్ పి.శ్రీనివాసులు స్టడీటూర్ వెళ్లనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ నుంచి అనుమతి వచ్చింది. స్టడీటూర్‌లో భాగంగా ఆస్తి పన్ను, నీటి సరఫరా, ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థల అమలుతీరు, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలు పరిశీలించనున్నారు.

గడువులోగా అర్జీల పరిష్కారం


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి ఏసీ శ్రీనివాసరావు

నగరపాలక సంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఇన్‌ఛార్జి అదనపు కమిషనర్ డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కౌన్సిల్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక 13, ఇంజినీరింగ్ 11, రెవెన్యూ 3, ప్రజారోగ్య విభాగం 5, అకౌంట్స్ విభాగం 1, ఉపా సెల్ 1 చొప్పున ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వచ్చిన అర్జీలను విభాగాల వారీగా అధికారులకు పంపి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌ఛార్జి ఏసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారుకు సమాచారం తెలియజేయాలన్నారు. డీసీ సీహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ రవి, మేనేజరు ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


భవనం కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

ప్రణాళిక విభాగం అనుమతులే భవన నిర్మాణాలకు కీలకం

నగరపాలకసంస్థ: నూతన భవన నిర్మాణాలు పట్టణ ప్రణాళిక విభాగం అనుమతుల మేరకు ఉండాలని కమిషనర్ పి.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆక్యుపెన్సీ ధ్రువపత్రం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో భాగంగా కోదండరామయ్యనగర్, గోరంట్ల, పెదపలకలూరు, కాకానిరోడ్డు, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో భవనాల కొలతలు పరిశీలించారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘించి చేసిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రణాళిక విభాగం అనుమతి పొందిన ప్లాను ప్రకారమే నిర్మాణాలు ఉండాలని ఆదేశించారు. సీపీ రాంబాబు, టీపీఎస్‌లు లక్ష్మణస్వామి, సువర్ణకుమార్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.


నందివెలుగురోడ్డు: కాళికాదేవిగా


రెడ్లబజారు: అమ్మవారి విగ్రహం వద్ద భక్తులు


పాతగుంటూరు: కుంకుమ పూజ చేస్తున్న మహిళలు


ఇందిరాకాలనీలో..

అమ్మలగన్న అమ్మ... అండదండా నీవేనమ్మ


మణిపురం వద్ద అమ్మవారు

నెహ్రూనగర్, పట్నంబజారు, న్యూస్‌టుడే: నగరంలోని పలు ఆలయాల్లో సోమవారం దేవీ శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాల నిర్వాహకులు అమ్మవారికి పలు అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్నంబజారు, ఏలూరుబజారు, ఇందిరా ప్రియదర్శినీకాలనీ, లాలాపేట వెంకటేశ్వరస్వామి ఆలయం, జగన్నాథస్వామి, కొత్తపేట శివాలయంతోపాటు మోతీలాల్‌నగర్, పరమయ్యకుంట, సీతానగర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల నిర్వాహకులు దేవాలయాన్ని పలు రకాల విద్యుత్తు దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.


చేనేతకాలనీలో పార్వతీమాత


అరుంధతినగర్‌లో మహాచండీదేవి


నెహ్రూనగర్‌లో అన్నపూర్ణ


శివాలయంలో కాళికాదేవి


జగన్నాథస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మి


పాతగుంటూరులో పోలేరమ్మ

ఇష్టానుసారం చెట్ల నరికివేత..

నగరపాలకసంస్థ: స్థానిక రింగురోడ్డు విద్యానగర్‌లో అంతర్గత రహదార్ల వెంట ఉన్న చెట్లను కొందరు వ్యక్తులు విచక్షణా రహితంగా నరికివేశారు. స్థానికులు ప్రశ్నించినా వారు సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యం వహించారు. చెట్ల తొలగింపు విషయం సామాజిక మాధ్యమాల్లో రావడంతో జీఎంసీ ఉద్యాన విభాగం అధికారులు స్పందించారు. ఆ చెట్లు నరికింది జీఎంసీ సిబ్బంది కాదని విద్యుత్తు శాఖ సిబ్బంది అని ఏడీహెచ్ రామారావు తెలిపారు.

బెదిరించాడని కేసు

గుంటూరు నేరవార్తలు: ఏటీ అగ్రహారానికి చెందిన అనంతరామిరెడ్డి వద్ద అతని స్నేహితుడు నారాయణరావు రూ.లక్ష అప్పుగా తీసుకున్నారు. నాలుగేళ్లయినా డబ్బులు తిరిగి ఇవ్వలేదని అడిగితే ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని, చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగరంపాలెం సీఐ వీరానాయక్ సోమవారం తెలిపారు.

చెరువు దుర్గంధం.. జనజీవనం దుర్భరం



నగర శివారు జనవాసాల మధ్యలోని రెడ్డిపాలెం చెరువు అభివృద్ధికి నోచుకోక దారుణంగా మారింది. ఈ చెరువును అభివృద్ధి చేసి వాకింగ్ నిర్మాణానికి రూ.కోటి మంజూరైనా గత వైకాపా ప్రభుత్వ హయాంలో పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుని దుర్గంధభరితంగా దోమలకు ఆవాసంగా మారింది. వర్షాల సీజన్ కావడంతో ఇప్పటికే పెద్ద సంఖ్యలో రెడ్డిపాలెం వాసులు విషజ్వరాల పాలయ్యారు. జనాల దుస్థితి చూసైనా అధికారులు చెరువు బాగుచేసే పనులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.
- ఈనాడు గుంటూరు

అనుమానాస్పదంగా తమిళనాడు కారు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మిర్చియార్డు సమీపంలో రహదారిపక్కనే తమిళనాడు రిజిస్ట్రేషన్ కలిగిన ఓ కారు కొన్నివారాలుగా ఉండడంతో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. నగరంపాలెం సీఐ వీరానాయక్, ట్రాఫిక్ సీఐ శింగయ్యలు సిబ్బందిని పంపించి లిఫ్టింగ్ వెహికల్‌లో ఆ కారును తీసుకువచ్చి పోలీసు కవాతు మైదానానికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: పెళ్లి చేసుకుంటానని మోసగించాడంటూ ఓ మహిళ సోమవారం నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావుపేటకు చెందిన ఓ మహిళ భర్తతో మనస్పర్థలు రావడంతో విడిపోయారు. విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈక్రమంలో అదే ప్రాంతానికి చెందిన గౌతం అనే వ్యక్తి పరిచయమై పెళ్లిచేసుకుంటానని నమ్మించి దగ్గరయ్యాక వివాహం చేసుకోనంటూ మోసగించాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరనాయక్ తెలిపారు.

గుంటూరు పశ్చిమ

చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు

పట్టాభిపురం: ఆక్రమణల తొలగింపు పేరుతో చిరు వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. పట్టణ ప్రణాళిక అధికారులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. పేదలు మాత్రమే రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకుంటారని, వారి పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. అటు ప్రజలకు, ఇటు చిరువ్యాపారులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా దుకాణాలు రోడ్డు అంచుల్లో పెట్టుకోవాలని సూచించారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుజ్జనగుండ్ల నుంచి పెదపలకలూరు వైపు వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టాభిపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలకలూరుకు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచి పోలీసులకు సమాచారం అందింది. పట్టాభిపురం పోలీసుల సహకారంతో సదరు వాహనాన్ని ఆపి తనిఖీలు నిర్వహించగా 50 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఇద్దరు వ్యక్తుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.6000 నగదు, 25 క్వింటాళ్ల బియ్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఐసీడీఎస్ రెడ్రసల్ కమిటీ సమావేశం వాయిదా

జిల్లా పరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు రెడ్రసల్ కమిటీ సమావేశం వాయిదా పడింది. సోమవారం మధ్యాహ్నం 4 గంటలకు కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సెక్టార్‌కు సంబంధించి ఇద్దరు నాయకులు మాత్రమే హాజరవ్వాలని నగర ప్రాజెక్టు కార్యాలయం నుంచి సిబ్బంది చెప్పడంతో అంగన్‌వాడీల సంఘాల నాయకులు ఆగిపోయారు. ఓ సంఘ నాయకులు హాజరయ్యారు. ఎక్కువ సంఘాల నాయకులు గైర్హాజరవడం, మధ్యాహ్నం వర్షం కురవడంతో సెక్టార్ల నుంచి నాయకులు వచ్చే అవకాశం లేకపోవడంతో వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. నగర ప్రాజెక్టు రెడ్రసల్ కమిటీ సమావేశానికి ఆయా సంఘాల నాయకులను ఆహ్వానించాలని కోరుతున్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-3 సబ్ డివిజన్ పరిధిలో అత్యవసరంగా విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 8న విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ రాజ మోహనరావు తెలిపారు. దీనివల్ల మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సంపత్‌నగర్, నల్లచెర్వు, పార్వతీపురం, అడపాబజార్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: జిల్లా క్షయ నివారణ అధికారి కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే విడుదలయ్యేలా చూడాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయలక్ష్మిని సోమవారం కార్యాలయంలో కలిసి పెట్రోల్ బిల్స్, ఎఫ్‌టీఏ త్వరగా చెల్లించాలని కోరారు.

హిందూ ఇంజినీరింగ్ విద్యార్థి ప్రతిభ

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ ద్వితీయ ఏడాది విద్యార్థి షేక్ మునీర్ రాష్ట్ర స్థాయి డెకాథ్లాన్‌లో ప్రతిభ చూపారని కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. సోమవారం కళాశాల కార్యాలయంలో మునీర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణమూర్తి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో ఈనెల 4 నుంచి 6 వరకు జరిగిన 37వ ఏపీ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 20 సంవత్సరాల బాలుర విభాగం డెకాథ్లాన్ ఈవెంట్‌లో తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఇతని స్ఫూర్తితో అన్ని విభాగాల్లో మరింత మంది క్రీడాకారులను తయారు చేసేదిశగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వజ్రాల నర్సిరెడ్డి, పీడీ క్రోసూరు రవి తదితరులు పాల్గొన్నారు.



మునీర్‌ను అభినందిస్తున్న చెరువు రామకృష్ణమూర్తి, పక్కన నర్సిరెడ్డి, పీడీ రవి

జీజీహెచ్‌లో శిశువులకు భద్రతేది?

చోద్యం చూస్తున్న నర్సింగ్, రక్షణ సిబ్బంది

నగరంపాలెం, న్యూస్‌టుడే: గుంటూరు సమగ్ర వైద్యశాలకు ప్రసవానికి తీసుకెళ్తే ఏ చింతా ఉండదని.. మంచి వైద్యంతో పాటు బిడ్డలకు రక్షణా ఉంటుందనుకునేవారు. ఇదంతా గతం. రాత్రాను ఇక్కడ కాన్పు అంటేనే భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. పుట్టిన పసికందులను అలవోకగా తస్కరించడం జీజీహెచ్‌లో పరిపాటిగా మారింది. పురుడు పోసిందే తడవు శిశువులను తస్కరించాలనే ఆలోచనతో ఉన్నవారు జీజీహెచ్‌లోనే తిష్ఠ వేసి ఉంటున్నారు. అదను దొరికితే చాలు.. పిల్లల్ని మాయం చేస్తున్న సంఘటనలు జీజీహెచ్ ప్రతిష్ఠను మసకబారుస్తున్నాయి. తాజాగా సోమవారం జరిగిన శిశువు అపహరణ సంఘటన అందరినీ మరోసారి ఉలిక్కిపడేలా చేసింది.

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందేందుకు ఆరేడు జిల్లాల నుంచి వస్తుంటారు. వందల సంఖ్యలో జీజీహెచ్ సిబ్బంది ప్రతి నిత్యం విధులు నిర్వహిస్తుంటారు. ఆసుపత్రిలో రక్షణకు సంబంధించి ఎలాంటి భరోసా లేకపోవడంతో దొంగల బెడద అధికంగా ఉంటోంది. ఆసుపత్రిలో ప్రయివేటు రక్షణ సిబ్బంది బాధ్యతలను ఓ గుత్తేదారుడు చూస్తుంటారు. అయితే రక్షణ సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ కరవైంది. దీంతో ఆసుపత్రిలో పిల్లలను అపహరించే వారి సంఖ్య అధికమైపోయింది. పర్యవేక్షణ లేకపోవడంతోనే ఆసుపత్రిలో ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

ఏడాదిలో మూడోసారి

జీజీహెచ్‌లో పసికందుల అపహరణ జరగడం ఏడాదిలో ఇది మూడోసారి. కాన్పుల వార్డు, బాలింతల వార్డులో పక్క మంచంలో ఉన్నవారు తమ బంధువులేనంటూ మాటలు కలుపుతూ దగ్గరై, తల్లి నిద్రపోయే సమయంలో పిల్లలను తస్కరించడం కొత్త ఎత్తుగడగా ఎన్నుకున్నారు.

★ కొద్ది నెలల క్రితం గుంటూరు నగరానికి చెందిన ఓ మహిళ జీజీహెచ్‌లో కాన్పు కోసం చేరారు. ఆడపిల్లను ప్రసవించిన తల్లి నిద్రిస్తుండగానే ఓ గుర్తు తెలియని మహిళ పసికందును చేతిక్రరల సంచిలో తీసుకుని పారిపోయింది. అప్పట్లో ఇది కలకలం రేపింది. బాధిత తల్లి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి, జీజీహెచ్‌లోని సీసీ కెమెరాల్లో నమోదైన వీడియోల ద్వారా పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలోని ఉప్పలపాడులో పసికందుతో పాటు తస్కరించిన మహిళ, పిల్లను పెంచుకోవాలనుకున్న వారిని అదుపులోకి తీసుకున్నారు.



పసిబిడ్డను ఎత్తుకుని వార్డులో నుంచి బయటకు వస్తున్న దృశ్యం

★ రెండు నెలల కింద గుంటూరు జిల్లా భట్టిప్రోలుకు చెందిన ఓ మహిళ కాన్పు కోసం జీజీహెచ్‌లో చేరగా ప్రసవం అనంతరం శిశువు చనిపోయింది. బాపట్ల జిల్లా చిన్నగంజాకు చెందిన ఓ మహిళ 9వ కాన్పు కోసం చీరాల ప్రాంతీయ వైద్యశాలలో కాన్పు కాగా.. ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆమె ఆరోగ్యం క్షీణించడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న సదరు మహిళ చనిపోవడంతో భట్టిప్రోలుకు చెందిన మహిళ శిశువును పెంచుకోవాలనే ఆలోచనతో పసికందును రూ.లక్షకు అమ్మకం చేశారు. విషయం వెలుగులోకి రావడంతో గుంటూరు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి పసికందును గుర్తించి శిశు సంక్షేమ శాఖకు అప్పగించారు.

సిబ్బంది అలసత్వమే కారణం

నర్సింగ్ సిబ్బంది, ప్రయివేట్ రక్షణ సిబ్బందే అలసత్వం కారణంగా సర్వజనాసుపత్రి ప్రతిష్ఠ మసకబారుతోందన్న వాదన వినిపిస్తోంది. పెద్దాసుపత్రిలో వందలాది మంది నర్సింగ్ సిబ్బంది, ప్రయివేటు రక్షణ సిబ్బంది ఉన్నా పసికందుల అపహరణలు చోటుచేసుకోవడంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డులోకి వచ్చేవారిని గుర్తించడంలో నర్సింగ్ సిబ్బంది, వార్డు బాయ్స్ విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా వారిలో మార్పు రాకపోవడంపై బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా జీజీహెచ్ ఉన్నతాధికారులు ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



జ్ఞాపకశక్తి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: జ్ఞాపకశక్తి పోటీల్లో నలుగురు విద్యార్థినులు ప్రతిభ కనబర్చడం అభినందనీయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. నలుగురు విద్యార్థినులు జ్ఞాపకశక్తి పోటీల్లో సత్తా చాటారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించిన శివ వెంకట సుక్షిత్, భవిష్య, కనిష్క, శ్రీవల్లిని ఆమె సోమవారం అభినందించారు. కార్యక్రమంలో శిక్షకురాలు నాగస్వప్న పాల్గొన్నారు.

గడువు లోగా అర్జీల పరిష్కారం

నగరపాలకసంస్థ: ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఇన్‌ఛార్జి అదనపు కమిషనర్ డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కౌన్సిల్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

పచ్చదనంపై వేటు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పచ్చదనంపై విద్యుత్తు శాఖ సిబ్బంది తమ కర్కశత్వం చూపారు. తీగలకు అడ్డు వస్తున్నాయన్న నెపంతో విద్యానగర్ మూడో లైనులోని ఆరో అడ్డరోడ్డులో పచ్చని చెట్లను ఇష్టారాజ్యంగా నరికేసి మోడుగా తయారు చేశారు. తీగలకు వచ్చే కొమ్మల వరకు తొలగించడం సాధారణమే. ఇక్కడ ఆవిధంగా గాకుండా నేలకు మూడు అడుగులు ఎత్తు కూడా లేకుండా చెట్లను మోడు చేసేశారు. స్థానికులు అయిదారేళ్లుగా ఈ ప్రాంతంలో మొక్కలను పెంచుకుంటున్నారు. విద్యుత్తు అధికారులు కొమ్మల్ని తొలగించామన్నారని కొంత మంది సిబ్బంది అక్కడకు వచ్చి మూడు యంత్రాల సాయంతో మొదళ్ల వరకు వేటు వేశారు. యంత్రాలను రూ.1200 వంతున అద్దెకు తీసుకువచ్చామని, రూ.1000 వంతున కూలి మాట్లాడుకున్నామని పేర్కొన్నారు. చెట్లను నరికేయవద్దని స్థానికులు వారిస్తున్నా ఖాతరు చేయకుండా నిలువునా కూలదోశారు. దీంతో స్థానికులు మల్లికార్జునరావు, రామకృష్ణ అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.



వారిస్తున్నా మొక్కలు నరికేస్తున్న విద్యుత్తు సిబ్బంది

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

ప్రాంతీయ కార్యాలయం, 40-9-27, పి.బి. నెం. 8, బెంజిసర్కిల్, రింగ్‌రోడ్డు, విజయవాడ - 520008

ఉపాధి రద్దుపై పబ్లిక్ నోటీస్

శ్రీ మాధవరపు మాధవ, తండ్రి : బాలయ్య, చిరునామా : హెచ్.నెం. 5-76, పెద్ద అలవలపాడు గ్రామం, పెదచెర్లోపల్లి మండలం, ప్రకాశం జిల్లా - 523111 లో నివసిస్తున్న పార్ట్‌టైమ్ స్వీపర్‌గా బ్యాంక్ సేవల్లో చేరారు. మరియు ప్రస్తుతం ఆఫీస్ అసిస్టెంట్ హోదాలో ఉన్నారు. మరియు ది. 09-01-2023 నుండి అనధికారికంగా గైర్హాజరయ్యారు.

అనేక సమాచారాలు ఉన్నప్పటికీ, మీరు డ్యూటీకి రిపోర్టు చేయలేదు. ఇది మీకు డ్యూటీకి రిపోర్ట్ చేయాలనే ఉద్దేశం లేదని తెలుపుతుంది. మీ నిరంతర గైర్హాజరు ఫలితంగా బ్యాంక్ సేవల రొటీన్ స్థానభ్రంశం చెందింది. అందువల్ల బ్యాంక్ మరియు వర్క్‌మెన్ యూనియన్‌ల మధ్య నమోదు చేయబడిన 02-06-2005 నాటి సెటిల్‌మెంట్ యొక్క క్లాజ్ 33ని బ్యాంక్ అమలు చేసింది. దీని ప్రకారం మీకు 20-03-2024 నాటి 1వ నోటీసు & 07-05-2024 నాటి 2వ నోటీసు జారీ చేయబడ్డాయి. డ్యూటీకి రిపోర్టు చేయడానికి మీకు ఈ ప్రకటన వచ్చిన తేదీ నుండి 15 రోజుల సమయం ఇస్తూ మేము ఇప్పుడు ఈ పబ్లిక్ నోటీసును జారీ చేసాము. మీరు డ్యూటీకి రిపోర్టు చేయడంలో విఫలమైతే, మీరు బ్యాంక్‌లో మీ ఉద్యోగాన్ని స్వచ్ఛందంగా ఖాళీ చేసినట్లుగా పరిగణించబడతారు. మరియు ఈ ప్రభావానికి సంబంధించి ఆర్డర్ మీకు అందించబడుతుంది.

అలాగే, మీకు ఇచ్చిన సమయానికి ముందే మీరు డ్యూటీకి రిపోర్టు చేసినట్లయితే, మీపై తగిన క్రమశిక్షణా చర్య తీసుకునే హక్కు బ్యాంకుకు ఉందని గమనించండి. బ్యాంక్‌కు మీ బకాయిలను సెటిల్ చేసుకోవాలని మీకు సలహా ఇవ్వబడింది, లేని పక్షమున న్యాయస్థానంలో మీపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు.

తేది: 08-10-2024, స్థలం : విజయవాడ

సం/-

సీనియర్ రీజనల్ మేనేజర్





విద్యానగర్ సాయినాథ సన్నిధానంలో మీనాక్షిదేవి



శారదాపరమేశ్వరి దేవస్థానంలో..



ఆర్.అగ్రహారం వేంకటేశ్వర స్వామి ఆలయంలో..



చుట్టగుంట పోలేరమ్మ గుడిలో..



ఏటీ అగ్రహారంలో భక్తుల పూజలు



గాయత్రి దత్తసాయి ఆలయంలో..

జగజ్జనని.. లోకపావని

గుంటూరు సాంస్కృతికం, ఏటీ అగ్రహారం, పట్టాభిపురం, గోరంట్ల, న్యూస్‌టుడే: నగరంలోని దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఎక్కువ మంది కామాక్షి, మీనాక్షి, సంతాన లక్ష్మి తదితర అలంకారాలు రూపుదిద్దారు. గణపతి, నవగ్రహ పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు దర్శన ఏర్పాట్లు చేశారు. కుంకుమ పూజలు, సువాసినీ పూజలు నిర్వహించారు.



శ్రీనివాసరావుతోటలో అమ్మవారు



స్తంభాలగరువు కోదండ రామాలయంలో..



గార్డెన్స్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో..



రవీంద్రనగర్‌లో..



కొరిటెపాడులో..



గోరంట్ల ఆఫీసర్స్ కాలనీ గాయత్రీ గౌతమ రుషి పీఠంలో

ఆకట్టుకున్న నవదుర్గల అలంకారాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అమరావతి రోడ్డులోని హిందూ కాలేజీ ఆఫ్ మేనేజిమెంట్‌లో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజిమెంట్ విద్యార్థులు నవదుర్గ మహిమ నృత్యరూపక సన్నివేశం, బతుకమ్మ నృత్యాలతో కళాశాల ప్రాంగణంలో సోమవారం సందడి చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాలకమండలి ఉపాధ్యక్షుడు సింగం లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిలో స్త్రీకి అత్యంత గౌరవప్రదమైన స్థానాన్ని ఇవ్వడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయమని, దీనికి గుర్తుగానే దేవీ నవరాత్రి ఉత్సవాలు చేస్తుంటారన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డి.కల్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ వైష్ణవి సాంకేతిక సహకారం అందించారు. ఎంబీఏ హెచ్‌ఓడీ డాక్టర్ వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్.వైష్ణవి, సీహెచ్.వేదవతి, ఎ.బాజిబాబు, ఎన్.మణికంఠ, పి.శశికళ తదితరులు పర్యవేక్షించారు.



నృత్యరూపకంలో పాల్గొన్న విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రమణ

13న మలేకర్ సంగీత విభావరి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కళాదర్బార్ సాంస్కృతికం సంస్థ వార్షికోత్సవం సందర్భంగా సుప్రసిద్ధ హిందీ చలనచిత్ర గాయని సంగీత మలేకర్ సంగీత విభావరిని నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకు అధ్యక్షుడు పొత్తూరి రంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 13న సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం జరుగుతుందని, పలువురు సుప్రసిద్ధ గాయనీ గాయకులు పాల్గొంటారన్నారు. ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అందరూ కలిసికట్టుగా పని చేయాలి

గోరంట్ల, న్యూస్‌టుడే: పార్టీ బలోపేతానికి నాయకులంతా కలిసికట్టుగా పనిచేయాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. బృందావనగార్డెన్స్‌లోని వైకాపా కార్యాలయంలో సోమవారం మంగళగిరి నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కమిటీలను త్వరితగతిన నియమించి పార్టీని మరింత పటిష్ఠపర్చేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ గుంటూరు పార్లమెంట్ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి, పార్టీ నేత గంజి చిరంజీవి, నాయకులు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో పాలన శూన్యం: వైకాపా నాయకులను కేసులతో వేధించడం తప్ప నాలుగు నెలల పాలనలో చంద్రబాబు చేసింది శూన్యమని మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. గుంటూరులోని ఆయన కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసు పేరుతో వైకాపా నాయకులను వేధిస్తున్నారన్నారు. పోలీసు వ్యవస్థను వైకాపాను బెదిరించేందుకు వాడుతున్నారన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

నెహ్రూనగర్: పెళ్లి చేసుకుంటానని మోసగించాడంటూ ఓ మహిళ సోమవారం నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావుపేటకు చెందిన ఓ మహిళ భర్తతో మనస్పర్థలు రావడంతో విడిపోయారు. విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈక్రమంలో అదే ప్రాంతానికి చెందిన గౌతం అనే వ్యక్తి పరిచయమై పెళ్లిచేసుకుంటానని నమ్మించి దగ్గరయ్యాక వివాహం చేసుకోనంటూ మోసగించాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరనాయక్ తెలిపారు.



తలచిన ధన్యం.. కొలిచిన పుణ్యం

ఇంద్రకీలాద్రిపై భక్తుల ఆర్జిత సేవలు



రాముడు కంటే.. కృష్ణుడు కంటే.. ప్రపంచంలో సకల దేవతల కంటే గొప్పవారు కనకదుర్గాదేవి. అందరికంటే గొప్పవారు.. లోకమాత.. జగన్మాత.. ఆమెకు మించిన భగవత్ శక్తి మరొకటి లేదు. ఏ దేవుడి శక్తినైనా సందేహించవచ్చు కానీ.. జగన్మాత శక్తి మాత్రం అనంతమైనది. ఆమె ముందు కృష్ణ శక్తి కూడా పని చేయదు... అంతటి శక్తిమంతురాలైన కనకదుర్గమ్మను అర్చించాలని ప్రతి భక్తుడూ కోరుకుంటాడు. అందుకే ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి నిత్యం ఇంద్రకీలాద్రికి తరలివస్తుంటారు. అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు తమ శక్తికొద్దీ ఆర్జిత సేవల్లో పాల్గొంటూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకి వేదవేదాంత వనవాసిని అయిన జగన్మాతకు నిత్యం త్రికాలార్చనలు, ఆర్జిత సేవలను ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహిస్తారు. సాధారణ రోజుల్లో ఆర్జిత సేవలు సుప్రభాత సేవ, ఖడ్గమాలార్చన, వస్త్రాలంకృత సేవ, శాంతి కల్యాణం, సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం, రాహుకేతు పూజ, లక్షకుంకుమార్చన, చండీహోమం, శ్రీచక్రనవావరణార్చన, రుద్రాభిషేకం పూజలకు భక్తులు టిక్కెట్ రుసుము చెల్లించి చేయించుకుంటారు. దసరా వేడుకల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్జిత సేవల్లో భాగస్వామ్యాన్ని కుదించారు. దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు మాత్రం భక్తులతో సంబంధం లేకుండా ఆర్జిత సేవలను అర్చకులు నిర్వహిస్తారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుంకుమార్చన, చండీహోమం, శ్రీచక్ర నవావరణార్చన, ఖడ్గమాలార్చన పూజలకు మాత్రమే ఉభయ దాతలను అనుమతిస్తున్నారు.

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

అత్యంత ప్రీతిపాత్రం కుంకుమార్చన

జగన్మాత దుర్గమ్మకు అత్యంత ప్రీతిపాత్రమైనది కుంకుమార్చన. శ్రీచక్ర సహితంగా ఏర్పాటు చేసిన అమ్మవారికి ఉభయదాతల గోత్ర నామాలతో పసుపు అర్చకులు లలితా సహస్రనామాలతో కుంకుమార్చన చేయిస్తారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 10 నుంచి 12 గంటల వరకు కుంకుమార్చనను ఇంద్రకీలాద్రిపై మల్లికార్జున మహామండపం 6వ అంతస్తులో నిర్వహిస్తారు. ఇద్దరు పాల్గొనవచ్చు. ఈ సేవ టిక్కెట్ రుసుం రూ.3వేలుగా నిర్ణయించారు. మూలా నక్షత్రం రోజు రూ.5 వేలు రుసుం చెల్లించాల్సి ఉంటుంది.



విశిష్టత
ఈ సేవతో మహిళలకు సౌభాగ్యం సిద్ధిస్తుందని విశ్వాసం.

లోక కల్యాణానికి చండీహోమం



విశిష్టత
సర్వ బాధల నుంచి విముక్తికి చండీహోమ ప్రశస్తమైనదని నమ్మకం. లోక కల్యాణం కోసం ఈ హోమం నిర్వహిస్తారు.

దుర్గామల్లేశ్వర స్వామి వారి క్షేత్రంలో నిత్యం చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. దసరా ఉత్సవాల్లో కుంకుమార్చన తరువాత ఉభయదాతలు అత్యంత ఇష్టపడే ఆర్జిత సేవ చండీహోమం. సప్తశతి శ్లోక మంత్రాలతో ఈ హోమాన్ని రుత్వికులు నిర్వహిస్తారు. లోక కల్యాణం కోసం నిత్యం జరిగే దీనిని దేవస్థానం ఏర్పాటు చేసింది. దసరా ఉత్సవాల్లో చండీహోమం టిక్కెట్ రుసుము రూ. 4 వేలుగా నిర్ణయించారు. ఇంద్రకీలాద్రిపై యాగశాలలో ఉభయ దాతల సమక్షంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు రుత్వికులు జరుపుతారు.

శోభాయమానంగా ఖడ్గమాలార్చన




విశిష్టత
ఈ అర్చన ద్వారా ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే శక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం.

దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే ఖడ్గమాలార్చనకు ప్రత్యేకత ఉంది. మూలవిరాట్ అభిముఖంగా కూర్చొని చేసే ఖడ్గమాలార్చనను దసరా ఉత్సవాల్లో మాత్రం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తుకు మార్చారు. సాధారణ రోజుల్లో ఖడ్గమాలార్చన టిక్కెట్లు పరిమితం కావడంతో భక్తులు నెల రోజులు వేచి ఉండాల్సి వస్తుంది. ప్రస్తుతం మల్లికార్జున మహామండపంలో ఉదయం 5 నుంచి 6 గంటల మధ్య ఈ సేవ భక్తులకు లభిస్తుంది. టిక్కెట్ రుసుం రూ.5,116గా నిర్ణయించారు.

నిత్యం త్రికాలార్చనలు

ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్లకు నిత్యం త్రికాలార్చనలను వేదపండితులు మంత్రోచ్ఛరణ నడుమ అర్చకులు నిర్వహిస్తారు. సుప్రభాత సేవ అనంతరం గణపతి పూజతో నిత్యం ప్రాతఃకాలార్చనను చేస్తారు. శ్రీసూక్త విధాన సహితంగా షోడశోపచారలను నిర్వహిస్తారు. శ్రీలలిత సహస్రనామాలతో లోకాలను ఏలే తల్లిని అర్చిస్తారు. బాలభోగాన్ని దద్దోజనాన్ని నివేదిస్తారు. ప్రాతఃకాలార్చన అనంతరం ఉదయం 5 గంటలకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు.

ఆదిశంకరులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి..





విశిష్టత
తొమ్మిది ఆవరణలలో దేవతలు కొలువుతీరిన శ్రీచక్రాన్ని పూజించడంతో అష్టైశ్వర్యాలు, సమస్త శుభాలు కలుగుతాయన్నది భక్తుల విశ్వాసం.

దుర్గమ్మ సన్నిధిలో ఆది శంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి నిత్యార్చన జరుగుతుంది. దసరా ఉత్సవాల్లో మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో శ్రీచక్రనవావరణార్చన సేవను ఏర్పాటు చేశారు. సృష్టి, స్థితి, లయకారిణి అయిన త్రిశక్తి స్వరూపిణికి మహిమాన్వితమైన శ్రీచక్రంతో అర్చన చేస్తారు. దసరా ఉత్సవాల్లో ఈ సేవ టిక్కెట్ రుసుం రూ. 3వేలుగా నిర్ణయించారు. మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు భక్తులకు ఈ సేవ అందుబాటులో ఉంటుంది. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్లో అమ్మవారి దర్శనాన్ని దేవస్థానం సిబ్బంది చేయించి ప్రసాదాలు అందజేస్తారు.



పంచహారతులతో సాయంకాలార్చన

అమ్మవారికి సాయంకాలం 5.30 గంటలకు శ్రీసూక్త విధానంతో షోడశోపచార పూజలు చేసి, సంకల్పం చేస్తారు. యాలకులు, కిస్మిస్, పండ్లు, సుగంధ ద్రవ్యాలతో కూడిన క్షీరాన్నాన్ని అమ్మవారికి నివేదిస్తారు. అమ్మవారికి వేదపండితుల మంత్రోచ్ఛరణ నడుమ ఓంకార, నాగ, కుంభ, పంచ, నక్షత్ర హారతులను సమర్పిస్తారు. పంచహారతులతో పాటు సింహ హారతిని కూడా ఇచ్చి వేదస్వస్తి నిర్వహిస్తారు. హారతుల సమయంలో అన్ని దర్శనాలను నిలిపివేస్తారు.

మధ్యాహ్న కాలార్చనగా మహానైవేద్యం

దుర్గగుడి ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేసిన తరువాత మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారికి అష్టోత్తర, శతనామార్చన చేసి నైవేద్యాన్ని సమర్పిస్తారు. పరిచారకులు సంప్రదాయ బద్ధంగా దేవస్థానం వంటశాల నుంచి తయారు చేసిన గంగాళాలతో ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాల్లోని దేవతామూర్తుల ఎదుట నివేదిస్తారు. భక్ష్య, దోష్య, లేహ్య, సూప శాకదాది సహితంగా సమర్పించే నైవేద్యాన్ని మహానైవేద్యంగా చెబుతారు.

ఐదో రోజు దసరా ఆదాయం రూ.48.31 లక్షలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా వేడుకల్లో భాగంగా ఐదో రోజు సోమవారం వివిధ సేవలు, దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 48.31 లక్షల ఆదాయం వచ్చింది. రూ. 500, రూ. 300, రూ. 100 దర్శనం టిక్కెట్ల రూ. 19.41లక్షలు, రూ. 5.20లక్షలు, రూ. 3.81 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదాల విక్రయంతో రూ. 16.25 లక్షలు, తలనీలాల టోకెన్ల ద్వారా రూ. 93,600 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో.. ధర్మ ప్రచార యజ్ఞం

2003లో చంద్రబాబు సూచనలతోనే ఆరంభం ● రెండు దశాబ్దాలుగా 'శ్రీకనకదుర్గప్రభ' వెలుగు



శ్రీకనకదుర్గప్రభ పత్రిక

ఈనాడు, అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కేంద్రంగా గత రెండు దశాబ్దాలుగా ధర్మ ప్రచార యజ్ఞం కొనసాగుతోంది. దుర్గమ్మ సన్నిధి నుంచి ధర్మ ప్రచారం చేయాలనే ఉద్దేశంతో 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో శ్రీకనకదుర్గప్రభ మాసపత్రిక ఆరంభమైంది. భవిష్యత్తు తరాలకు పురాణాలు, ఇతిహాసాల గొప్పతనాన్ని తెలియజేయాలనే ప్రధాన ఉద్దేశంతోనే దుర్గమ్మకు సొంత పత్రికను ప్రారంభించారు. కనకదుర్గమ్మ వైభవం, మల్లేశ్వరస్వామి మహిమలు, రామాయణం, భాగవతం, భారతాల సారాంశాలను నేటి తరానికి అందిస్తోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2003లో అప్పటి దేవాదాయశాఖ మంత్రి, ఉన్నతాధికారులు, ఆలయ కార్య నిర్వహణ అధికారితో సమీక్ష సమావేశం నిర్వహించి.. విజయవాడ దుర్గమ్మ సన్నిధి నుంచి ధర్మ ప్రచార మాస పత్రిక ప్రారంభించాలని నిర్ణయించారు. 2003 ఉగాది నుంచి పత్రికను ఆరంభించారు. పురాణ, ఇతిహాసాలతోపాటు ప్రతినెలలో పండగలు, వ్రతాలు, పూజల వివరాలతో పాటు అనేక విషయాలను భక్తులకు తెలియజేస్తోంది. గత 21 ఏళ్లుగా శ్రీకనకదుర్గప్రభ మాసపత్రిక ద్వారా దుర్గగుడి కేంద్రంగా ధర్మ ప్రచారం నిర్విరామంగా కొనసాగుతోంది.

అత్యంత నాణ్యతగా లడ్డూ ప్రసాదం



లడ్డూ పోటులో ప్రసాదం తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : అత్యంత నాణ్యతగా దుర్గగుడి లడ్డూ ప్రసాదం తయారు చేయాలని జిల్లా కలెక్టర్ సృజన ఆలయ అధికారులకు సూచించారు. మల్లికార్జునపేటలోని ప్రసాదాల తయారీ కేంద్రం(లడ్డూ పోటు)ను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. లడ్డూ, పులిహోర తయారీకి వినియోగించే దినుసులను పరిశీలించారు. ప్రసాదాల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. మూలా నక్షత్రం రోజుకు రెండున్నర లక్షల లడ్డూలు సిద్ధం చేయాలన్నారు. సరకుల నాణ్యత పరీక్షించేందుకు నమూనాలను ఎప్పటికప్పుడు సేకరించి ల్యాబ్‌కు పంపాలన్నారు. ఏమాత్రం అనుమానం వచ్చినా సరకులను తిప్పి పంపి, నాణ్యమైనవి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కనకదుర్గానగర్‌తోపాటు భవానీ ఘాట్ వద్ద కూడా ప్రసాదాలు విక్రయిస్తారని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మూలా నక్షత్రం రోజు 2.50 లక్షల మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉన్నందున క్యూలైన్లు, దర్శనం, ప్రసాదాలు, అన్నప్రసాద పంపిణీ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ రమాదేవి, ఏఈవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్ హేమదుర్గ పాల్గొన్నారు.

నేటి అలంకారం

8-10-2024, మంగళవారం

శ్రీ మహాలక్ష్మీ దేవి



సరసిజనిలయే సరోజహస్తే
ధవళతరాంశుక గంధమాల్యశోభే
భగవతి హరివల్లభే మనోజ్ఞే
త్రిభువన భూతికరి ప్రసీదమహ్యామ్॥

సిరిసంపదలు, సౌభాగ్యం, సంతానం, ధైర్యసాహసాలు, విజయానికి అధిష్ఠాన దేవత మహాలక్ష్మి. సకల లోకాలకు ఐశ్వర్య ప్రదాయిని. ఇరువైపులా గజరాజులు సేవిస్తుండగా, రెండు చేతులతో కమలాలు ధరించి, అభయ, వరదముద్రలతో క్షీరాబ్ది పుత్రికయై ఈ తల్లి భక్తులకు దర్శనమిస్తారు. డోలాసురుడనే రాక్షసుడిని సంహరించి, లోకాలకు శాంతి ప్రసాదించింది. త్రిపురాత్రయంలో ఈమె మధ్యశక్తి. 'యా దేవీ సర్వ భూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా' - సకల జీవుల్లో లక్ష్మీరూపంలో ఈ తల్లి కొలువై ఉంటుందని చండీసప్తశతి చెబుతోంది. రుగ్వేదం పదో మండలంలోని శ్రీసూక్తం ఈ తల్లి వైభవాన్ని కీర్తిస్తుంది. అగ్ని, మత్స్య పురాణాలు ఈమె ఆకృతి, శిల్పనిర్మాణ నియమాలు వెల్లడిస్తాయి. అష్ట లక్ష్ములకు ఈమె అధిష్ఠాత్రి. ఈ తల్లి ఉపాసన ద్వారా లౌకిక సంపదలతో పాటు అలౌకికమైన మోక్ష సంపద కూడా లభిస్తుంది. ఈమె శ్రీఘ్ర ఫలదాయిని. శ్రీసూక్త విధానంగా ఎర్రని పుష్పాలతో, లక్ష్మీ అష్టోత్తరంతో ఈమెను అర్చించాలి. అమ్మకు ప్రీతిగా సువాసినీ పూజ చేయాలి. లక్ష్మీస్తోత్రాలు పఠించాలి. ఓం శ్రీం హ్రీం క్లీం మహాలక్ష్మై స్వాహా అనే మంత్రాన్ని జపించాలి.

సాంస్కృతిక రాజధాని ఆంధ్రా ప్యారిస్

తెనాలిలో రంగస్థల ప్రముఖుల శతజయంతి సదస్సు



మాట్లాడుతున్న రంగస్థల నటుడు, దర్శకుడు డీఎస్ఎన్ మూర్తి, వేదికపై బుచ్చిబాబు,జయదేవ్, సాంబశివరావు, సీతారామయ్య

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఆంధ్రా ప్యారిస్ సాంస్కృతిక రాజధాని అని ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు డీఎస్ఎన్ మూర్తి పేర్కొన్నారు. కళలకాణాచి తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్ (విజయవాడ) ఆధ్వర్యంలో ప్రదర్శించనున్న ఆరు రోజుల జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక, నాటికల పోటీల్లో భాగంగా తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన రంగస్థల ప్రముఖుల శతజయంతి సదస్సుకు ఆయన అధ్యక్షత జరిగింది. సదస్సులో ఆయన మాట్లాడుతూ యూరప్‌లో పారిస్ కేంద్రంగా కవులు రాణించారని, దీంతో కళలకు నిలయమైన తెనాలిని పారిస్‌గా పిలుచుకుంటున్నట్లు వివరించారు. రంగస్థల దర్శకుడు కన్నెగంటి నాసరయ్య, రంగస్థల కళాకారుడు వెంకట్రామయ్య, రచయితలు కొడాలి గోపాలరావు, బెల్లంకొండ రామదాసులు ఆయా రంగాలకు చేసిన సేవలను రంగస్థల నటులు కారుమంచి సీతారామయ్య, అధ్యాపకుడు, విశ్లేషకుడు కందిమళ్ళ సాంబశివరావు, వక్త వేల్పుల బుచ్చిబాబు, రచయిత, పాత్రికేయుడు రెంటాల జయదేవ్ వివరించారు. అనంతరం వల్లూరు వెంకట్రామయ్య చౌదరి స్మారక పురస్కారాన్ని రంగస్థల పౌరాణిక నటుడు ఆచంట బాలజీనాయుడుకు, కన్నెగంటి నాసరయ్య స్మారక పురస్కారాన్ని రచయిత జరుగుల రామారావుకు, రచయిత కొడాలి గోపాలరావు స్మారక పురస్కారాన్ని రచయిత వల్లూరు శివప్రసాద్‌కు, బెల్లంకొండ రామదాసు స్మారక పురస్కారాన్ని రచయిత జమ్మలమడక శశిమోహన్‌కు అతిథులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెనాలి దుర్గభవాని నాట్యమండలి వారు ప్రదర్శించిన పద్య నాటిక శ్రీకృష్ణరాయబారం (పాన్పుసన్నివేశం) ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కళలకాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీమాటల రచయిత బుర్రా సాయిమాధవ్, అరసం జాతీయ నాయకులు పెనుగొండ లక్ష్మీనారాయణ, బుర్రా జయలక్ష్మి, చెరుకుమల్లి సింగారావు మాట్లాడారు.

పరిష్కార వేదికకు 160 అర్జీలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సోమవారం 160 అర్జీలు దాఖలయ్యాయి. కలెక్టరేట్‌లోని ఎస్. ఆర్. శంకరన్ హాలులో జరిగిన కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఆర్వో పి. రోజా, ప్రత్యేక ఉప కలెక్టర్ లక్ష్మీకుమారి, గంగరాజు, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఆర్డీవో కె. శ్రీనివాసరావు, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిహారం అందలేదు

– రైతులు పలికే బాబూరావు, దేవరపల్లి దావీదు, బ్రాహ్మణకోడూరు

ఆగస్టు నెలాఖరున వర్షాలు, వరదలకు పంట పూర్తిగా పోయింది. కనీసం పంట నష్టం నమోదుకు ఎవరూ రాలేదు. మా పేర్లను కూడా నమోదు చేసుకోలేదు. చెరో 20 ఎకరాలు వరి సాగు చేశాం. వరదలతో అదంతా కొట్టుకుపోయింది. ప్రభుత్వం పరిహారం ఇస్తుందని ఎదురుచూసినా అందలేదు. అధికారులు స్పందించి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలి.



నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించండి

గుంటూరు నగరంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రోడ్లపై ఆక్రమణలు తొలగించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. నగరంలో ట్రాఫిక్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటోలు, సిటీబస్సులు ఎక్కడంటే అక్కడ నిలుపుదల చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలను రాష్‌గా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఏపీ రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి భగత్‌సింగ్, నగర ఆవాజ్ అధ్యక్షుడు సైదా, భీమ్‌సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. నీలాంబరం తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను కొనసాగించాలి

ప్రభుత్వాసుపత్రి వద్ద చిరు వ్యాపారులను అక్కడే కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో చిరు వ్యాపారులతో కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి అందుబాటులో తినుబండారాలను అందిస్తున్నారని, నగరపాలక సంస్థ నుంచి వీధి వ్యాపారులుగా గుర్తింపు పొందారని, వారిని ఇప్పుడు తొలగించడం సరికాదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో చిరువ్యాపారుల సంఘ నాయకులు డి. వెంకటరత్నం, నరసింహారావు, బాబు, జమీల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పీజీఆర్ఎస్‌లో వినతిని ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజా సంఘాల నాయకులు

గుంటూరులో పీఎంజే జ్యువెల్స్ స్టోర్ ప్రారంభం

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: పీఎంజే జ్యువెల్స్ గుంటూరులో ఏర్పాటు చేసిన కొత్త ఔట్‌లెట్‌ని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కొత్త షోరూం ఆభరణాల ప్రియులను ఎంతగానో ఆకర్షిస్తుందన్నారు. పీఎంజే జ్యువెల్స్ ఏపీ స్టేట్ హెడ్ హైదర్ అలీ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులను దృష్టిలో ఉంచుకుని వజ్రాలు, బంగారం, విలువైన రాళ్లతో విస్తృతమైన డిజైన్ల ప్రదర్శనను ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ కందకూరి అరవింద్‌కుమార్, గుంటూరు స్టోర్ మేనేజర్ మహేష్‌కృష్ణ చైతన్య పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే మాధవి, హైదర్ అలీ, అరవింద్‌కుమార్, మహేష్‌కృష్ణ చైతన్య తదితరులు

పాఠశాలల అభివృద్ధికి యాజమాన్య కమిటీల పాత్ర కీలకం

తుళ్లూరు, న్యూస్‌టుడే : పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి స్కూల్ యాజమాన్య కమిటీలు కీలక పాత్ర వహిస్తాయని రాష్ట్ర సమగ్ర శిక్షా పథక సంచాలకుడు బి. శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పెదపరిమిలోని మువ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్‌లో 320 మంది సమన్వయకర్తలకు చేపట్టిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఎంపికైన ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు దాదాపు 320 మంది రాష్ట్ర రిసోర్స్‌పర్సన్‌లుగా పాఠశాల యాజమాన్య కమిటీ అభివృద్ధికి శిక్షణ పొందారని చెప్పారు. ఈ కమిటీలు పాఠశాల అభ్యసన ఫలితాలపై దృష్టి సారించాలని సూచించారు. 3 నుంచి 8 ఏళ్ల వయసు విద్యార్థులను విద్యాపరంగా ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మంచి పౌరులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. అనంతరం పాఠశాల యాజమాన్య కమిటీ కరదీపికను ఆవిష్కరించారు.

టైర్ పేలి వ్యాన్ బోల్తా

దేవరపల్లి: అతివేగంగా వస్తున్న వ్యాన్ టైర్ పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. హైవే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గుంటూరు జిల్లా నుంచి సోమవారం రాత్రి విశాఖపట్నం గొర్రెల లోడుతో వెలుతున్న వ్యాన్ తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి సమీపంలోకి వచ్చే సరికి టైర్ పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురులో ఇద్దరికి స్వల్ప, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. 27 గొర్రెలు మృతి చెందాయన్నారు.

ఎన్జీవో హోంలో ఓటరు నమోదు సహాయ కేంద్రం

కలెక్టరేట్(గుంటూరు): ఏపీ ఎన్జీవో హోంలో పట్టభద్రుల నియోజకవర్గం ఓటరుగా నమోదుకు సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఏపీ ఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు జిల్లా కోర్టు రోడ్డులోని సంఘ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఈ కేంద్రంలో ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు నమోదు పత్రం 18ని పొందవచ్చని, వాటిపై గెజిటెడ్ అధికారులతో పరిశీలన చేయించుకుని, రిజిస్ట్రేషన్ కూడా చేయించుకునే ప్రక్రియ సులభతరం అయ్యేలా ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్‌షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ ఎన్జీజీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు

కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జ్ఞానదివ్యకు కాంస్య పతకం



తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 4 నుంచి సౌత్ ఆఫ్రికా, సన్‌సిటిలో జరుగుతున్న కామన్‌వెల్త్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెనాలి మండలం కఠెవరానికి చెందిన క్రీడాకారిణి నాగం జ్ఞానదివ్య ఓవర్ ఆల్ కాంస్య పతక విజేతగా నిలిచిందని గురువు, నందివెలుగు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని శిరీష సోమవారం తెలిపారు. 84 ప్లస్ విభాగంలో స్క్వాట్ 160 కేజీలు, బెంచ్ ప్రెస్ 55 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 157.5 కేజీలతో ఆయా విభాగాల్లో కాంస్య పతకాలతో పాటు ఓవరాల్ 372.5 కేజీల బరువు ఎత్తి మూడో స్థానం పొంది మొత్తం మీద నాలుగు కాంస్య పతకాలు సాధించినట్లు ఆమె వివరించారు. ప్రస్తుతం కెఎల్‌యూలో డిగ్రీ రెండో ఏడాది చదువుతున్న జ్ఞానదివ్య గతంలోనూ పలు అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించారు.

బెంగళూరు పాలిక చీఫ్ కమిషనర్‌తో భేటీ

బెంగళూరు(యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి, తాడేపల్లి నగరపాలిక కమిషనర్ ఎస్. కె. అలీం బాషా, ఉప కమిషనర్ ఎన్. అమరయ్య నేతృత్వంలోని అధికారుల బృందం సోమవారం కర్ణాటకలోని బృహత్ బెంగళూరు మహానగర పాలిక చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్‌ను కలిసింది. పాలికలో అమలు చేస్తున్న ఆర్థిక విధానాలు, ఆస్తి పన్ను వసూళ్లు, ఆదాయ వనరులు, చెత్త నిర్మూలన విధానాలు, పరిశుభ్రత, పరిసరాల స్వచ్ఛత తదితర వాటి గురించి అధికారులు తెలుసుకున్నారు. ఆయా పథకాలు, ఇతర అంశాలతో పాటు వాటిని అమలు చేస్తున్న విధానాలపై ప్రత్యేక కమిషనర్ లక్ష్మీదేవి ఆంధ్రప్రదేశ్ అధికారుల బృందానికి వివరించారు.



తుషార్‌గిరినాథ్‌తో మంగళగిరి, తాడేపల్లి నగరపాలిక కమిషనర్, అధికారులు

రైతులకు నష్టం కలిగించే గిడ్డంగుల యాజమాన్యాలపై చర్యలు

మిర్చియార్డు, న్యూస్‌టుడే: రైతులకు నష్టం కలిగించే శీతలగిడ్డంగుల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు హెచ్చరించారు. శీతలగిడ్డంగుల యజమానుల సంఘ నాయకులతో మిర్చియార్డులో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఇటీవల గుంటూరులోని ఓ శీతలగిడ్డంగిలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై చర్చించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ యాజమానులు శీతలగిడ్డంగిని అద్దెకు ఇస్తే లీజు అగ్రిమెంట్ చేసుకొని పూర్తి సమాచారాన్ని తెలియజేయాలన్నారు. సబ్ లీజు దారు మార్కెట్ కమిటీ వద్ద లైసెన్స్ తీసుకునే బాధ్యత యాజమాన్యమే తీసుకోవాలని సూచించారు. రైతులు సరకు నిల్వ చేసుకునే తేదీన నిల్వదారుడి పేరు, పూర్తి చిరునామా, సరకు వివరాలు, వాహనం నంబర్‌తో సహా నమోదు చేసి విధిగా శీతలగోదాము బాండును రైతులకు ఇవ్వాలన్నారు. ఒరిజనల్ బాండును నిల్వదారులకు మాత్రమే ఇవ్వాలని, ఇతరులకు అప్పగిస్తే సంబంధిత గిడ్డంగి యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు. మిర్చి బస్తాలు అమ్మే సమయంలో కాటా చిట్టాలో వేమెన్లు విధిగా బాండు నంబర్, రైతుకు సంబంధించిన వివరాలన్నీ తెలపాలన్నారు. నిల్వ ఉన్న సరకుకు బీమా చేయాలని, దొంగతనం, అగ్ని ప్రమాదం, ఇతర ప్రమాదాలు సంభవిస్తే బీమా వర్తించేలా జిరాక్స్ పత్రాలను మార్కెట్ కమిటీకి ఇవ్వాలన్నారు. నిల్వ ఉన్న సరకు నాణ్యతా ప్రమాణాలు తగ్గకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శీతలగిడ్డంగుల్లో ఉన్న సరకు రైతులు, వ్యాపారుల వారీగా ప్రతి నెలా మార్కెట్ కమిటీకి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో మిర్చియార్డు కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శీతలగడ్డంగుల యజమానుల సంఘం నాయకులతో సమావేశమైన కాకుమాను శ్రీనివాసరావు